



# విజయభాను

హైదరాబాద్, శనివారం 02-09-2017 | VIJAYABHANU DAILY HYDERABAD EDITION | సంపుటి : 36 సంచిక : 351 పేజీలు : 8 వెల : 1 రూపాయి


## అందరికీ నమస్కారం



- దేశానికి ఏపీ ఎంతో చేసింది
- బాబు హయాంలో కొత్త ప్రయాణం
- భారత రాష్ట్రపతి కోవింద్
- ప్రజాస్వామ్య దేశం ప్రత్యేకత
- రాష్ట్రపతికి ఘనంగా పౌర సన్మానం
- ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు

తిరుపతి : ఏపీ ఐటీ కంపెనీలు దేశవ్యాప్తంగా ఫేమస్ అని కోవింద్ తెలిపారు. చంద్రబాబు హయాంలో ఏపీలో కొత్త ప్రయాణం ప్రారంభమైందని చెప్పారు. ఐటీ, మౌలిక సదుపాయాలకు ఏపీ పెట్టింది పేరు అన్నారు. పేదల అభివృద్ధికి చంద్రబాబు అన్ని చర్యలు తీసుకుంటు న్నారని చెప్పారు.

**రాష్ట్రపతికి ఘన పౌర సన్మానం**

రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను ఘనంగా సత్కరించారు. తొలుత రాష్ట్రపతికి తిరుమల తిరుపతి దేవస్థాన వేద పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. గవర్నర్, ముఖ్యమంత్రి పూలమాలలు వేసి, శాలువలతో సత్కరించారు. అనంతరం సన్మాన పత్రాన్ని రాష్ట్రపతికి అందించారు. ఈ సందర్భంగా శ్రీవారి జ్ఞాపికను ముఖ్యమంత్రి అందజేశారు.

**ఏపీ దేశానికి ఎంతో చేసింది, కేంద్రం సహకారం**

తన రెండో పర్యటననే తరువాయి 2లో



కేబినెట్ విస్తరణకు

## ముహూర్తం ఖరారు..



**న్యూఢిల్లీ :** కేంద్ర కేబినెట్ విస్తరణకు ముహూర్తం ఖరారైంది. ఆదివారం (సెప్టెంబర్ 3) ఉదయం 10 గంటలకు కొత్త మంత్రులతో ప్రమాణస్వీకారం చేయించనున్నారని అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ కార్యక్రమం కోసం రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమం ముగిసిన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ బ్రిక్స్ దేశాల శిఖరాగ్ర సదస్సులో పాల్గొనడానికి చైనాకు బయలుదేరి వెళతారు. 2014లో నరేంద్ర మోదీ ప్రధానమంత్రి పదవి చేపట్టిన తర్వాత జరుపుతున్న మూడో మంత్రివర్గ విస్తరణ ఇది.

అమిత్ షాతో కలిసి మోదీ గురువారం సాయంత్రమే మంత్రివర్గ పునర్వ్యస్థీకరణకు సంబంధించిన తుది జాబితా సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. జేడీయూ, ఏఐఏడీఎంకే పార్టీలకు కూడా ఈ మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కనుంది. మరోవైపు మరికొంత తరువాయి 2లో

## కాకినాడ పీఠంపై టీడీపీ జయకేతనం



- 30 ఏళ్ల తర్వాత కార్పొరేషన్ పీఠం కైవశం
- ఎన్నికల్లో కాపు ప్రభావం చూపలేదు
- ప్రజలు అభివృద్ధికే పట్టం కట్టారు
- నమ్మకంతో గెలిపించినందుకు ధన్యవాదాలు
- కాకినాడను స్మార్ట్‌సిటీగా అభివృద్ధి చేస్తా
- విపక్షాల బెదిరింపులకు భయపడేది లేదు
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



కాకినాడ: హేతుబద్ధత లేని విభజనతో సంక్షోభంలో పడిన రాష్ట్రాన్ని తాను అభివృద్ధి చేస్తాననే నమ్మకం ప్రజల్లో ఉందని, ఆ విశ్వాసంతోనే తమ పార్టీకి అపూర్వమైన విజయాలను అందించారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. తమ పార్టీని గెలిపించిన కాకినాడ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కాకినాడను స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తామని స్పష్టంచేశారు. ప్రాంతాలు, తరువాయి 2లో

### కెఎంసీ 'దేశం' కైవశం

కాకినాడ నగర పాలక సంస్థ ఎన్నికల్లో అధికార తెదేపా కూటమి సత్తా చాటింది. 32 డివిజన్లలో చారిత్రక విజయంతో కాకినాడ పీఠంపై పసుపు జెండా రెపరెపలాడింది. రాష్ట్రంలో రాజకీయ కాక పుట్టించిన ఈ ఎన్నికల్లో నగరపాలక సంస్థను తెలుగుదేశం కైవసం చేసుకొని చారిత్రక విజయం సాధించింది. 30 ఏళ్ల సుదర్ఘీకాలం తర్వాత కాకినాడ మేయర్ పీఠాన్ని సొంతం చేసుకుంది. మొత్తం 48 డివిజన్లకు జరిగిన ఈ ఎన్నికల్లో తెదేపా, తరువాయి 2లో




## జంట జలాశయాల నీరు విడుదల




హైదరాబాద్: జలమండలి అధికారులు గండిపేట మండలంలోని జంట జలాశయాల నుంచి నగరానికి నీటి సరఫరాకు శ్రీకారం చుట్టారు. ఈ జలాశయాలలో తగినంత నీరు లేకపోవడంతో ఏడాది కాలంగా నీటి విడుదల నిలిపివేశారు. ఎగువ ప్రాంతాల నుంచి వరదలు రాకపోవడంతో చెరువులు నిండని పరిస్థితి నెలకొంది. ఒకవైపు రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో వర్షాలు కురుస్తుండటంతో పలు జలాశయాలు పొంగిపొర్లుతున్నాయి. అయితే హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జలాశయాలు మాత్రం సగం కూడా నిండలేదు. గతేడాది కురిసిన వర్షాలకు కొంత వరకు నీరు చేరగా అధికారులు ఆ నీటిని సరఫరా చేయకుండా నిల్వచేశారు. ఆ నీటిలో కొంత భాగం ఆవిరైపోయింది. ఈ ఏడాది ఎగువ ప్రాంతాలలో కొంత వరకు వర్షాలు కురిసినా స్వల్పంగానే నీరు చేరింది. ప్రస్తుతం జంటనగరాలకు కృష్ణాజలాల సరఫరా తగ్గిన నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రస్తుతం జంటజలాశయాలలో ఉన్న నీటిని ఆదేశించినట్లు తెలిసింది. దీంతో ఉస్మాన్‌సాగర్ నుంచి 18 ఎంజీడీ నీటిని విడుదల చేశారు. హిమాత్‌సాగర్ నుంచి నీటి సరఫరా చేసేందుకు పైపులైన్ తనిఖీ చేశారు. రెండు రోజులలో హిమాయత్‌సాగర్ నుంచి కూడా నీటిని విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. హిమాయత్‌సాగర్ పూర్తిస్థాయి నీటి మట్టం 1765.00అడుగులు కాగా గురువారం 1745.26 అడుగులుగా ఉంది. అదేవిధంగా ఉస్మాన్‌సాగర్ పూర్తి స్థాయి నీటిమట్టం 1790.00 అడుగులు కాగా 1776.70 అడుగులుగా నమోదయ్యింది.

### టేకిట్ ఈజీ



కార్పొరేషన్ ఎన్నికల్లో గెలిచిన తమ్ముళ్లకు స్వాగతం!! ఇక కార్పొరేషన్ పీఠంపైనే దృష్టి!!

రికార్డుల ప్రక్షాళనతో

## వివాదాలకు చరమగీతం

- పాతకు స్వస్తి.. కొత్తకు నాంది
- అందరూ మూడునెలలు ఇదే పనిలో ఉండాలి
- కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు



హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం పాత విధానాలకు స్వస్తి పలుకుతూ కొత్తకు నాంది కావాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అభిలషించారు. రికార్డుల ప్రక్షాళనతో అన్ని వివాదాలకు చరమగీతం పాడాలన్నారు. రికార్డుల్లో రైతులకు అర్థం కాని పహాణీ, సేత్వారీ, పౌతిలాంటి పదాలు తొలిగించి, రైతులకు అర్థమయ్యే సరళమైన తరువాయి 2లో




# భాజపాను బలోపేతం చేద్దాం



గోపాలపూర్ : గోపాలపూర్‌లో భాజపాను బలోపేతం చేయాలని, రానున్న ఎన్నికలలో ఈ నియోజకవర్గంలో కమల వికాసమే నాయకులు, కార్యకర్తల ధ్యేయం కావాలని భాజపా రాష్ట్ర పరిశీలకుడు దీప్తిరంజన్‌సాహు కోరారు. గోపాలపూర్ రేవువీధిలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో పట్టణ భాజపా నాయకులు, కార్యకర్తల సమావేశం ఏర్పాటైంది. ఈ సందర్భంగా పరిశీలకునిగా వచ్చిన దీప్తిరంజన్ మాట్లాడుతూ కమల దళపతి అమిత్‌షా పార్టీని బలోపేతం చేసి ఎన్నికలకు సిద్ధం కావాలని ఇదివరకే సూచించిన సంగతి గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో అన్నిచోట్లా కార్య కర్తలు కలిసి కట్టుగా ఉద్యమించి భాజపాకు మరింత పటిష్టం చేయాలని కోరారు. భాజపా రాష్ట్రశాఖ ఉపాధ్యక్షుడు బిభూతిభూషణజెనా మాట్లాడుతూ గోపాలపూర్‌లో 9 బూత్‌లు పటిష్టంగా ఉన్నా యని, కార్యకర్తలు సమిష్టిగా పనిచేస్తుందన ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో గోపాల పూర్ పట్టణ భాజపా అధ్యక్షుడు అశోక్ కుమార్‌సాహు, ఇతర నాయకులు అశోక్ కుమార్‌బెహరా, రఘునాథ్‌బెహరా తదితర నాయకులు ప్రసంగించారు. కార్యక్రమానికి పెద్దసంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు.

### సెప్టెంబరు 29 నుంచి

# అంతర్జాతీయ చదరంగం పోటీలు

బెంగళూరు : యలహంకలోని రైల్‌వీల్ ఫ్యాక్టరీ క్రీడా సంస్థ మూడో ఆర్‌డబ్ల్యుఎఫ్ అంతర్జాతీయ ఓపెన్ ఫిడేరేటెడ్ చదరంగం పోటీలకు ఆతిథ్యం ఇస్తోంది.

సెప్టెంబరు 29 నుంచి అక్టోబరు 3 వరకు జరిగే ఈ పోటీల్లో దేశ వ్యాప్తంగా 800 మంది క్రీడాకారులు పాల్గొంటారని అంచనా వేస్తున్నట్లు నిర్వాహకులు తెలి పారు. గ్రాండ్‌మాస్టర్లు, అంతర్జాతీయ మాస్టర్లు పాల్గొంటున్నారు. దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లకు కూడా పోటీలు జరుగుతాయి.

రూ.5 లక్షల నగదు బహుమతితో నిర్వహిస్తున్న ఈ పోటీల గురించి మరిన్ని వివరాలను వెబ్‌సైట్‌లో పొందవచ్చు.

# సీమ నీటిపారుదల ప్రాజెక్టులపై అధ్యయనం

బెంగళూరు : కరవు తాండవిస్తున్న రాయలసీమలో నీటి పారుదల ప్రాజెక్టులపై బెంగళూరు తెదేపా ఫోరం (బీటీఎఫ్) సమగ్ర అధ్యయనం చేపట్టింది. నాలుగు బృందాలుగా కడప, అనంతపురం, చిత్తూరు, కర్నూలు జిల్లాల్లోని 10 ప్రధాన జలాశయాల ప్రగతిని పరిశీలించినట్లు సమాఖ్య సభ్యులు ఇక్కడ తెలిపారు. మారాల, గోరుకల్లు, చెర్లోపల్లి జలాశయాలు, సిద్ధాపురం, ముచ్చుమర్రి ఎత్తిపోతల, కుప్పం, మడకశిర కాల్వలు, అవుకు, పులికనుమ ప్రాజెక్టులపై సమగ్ర అధ్యయనం చేశామన్నారు. పదేళ్లగా వర్షాలు లేక తీవ్ర ఎద్దడిని ఎదుర్కొంటున్న రాయలసీమకు పునఃవ్కెభవాన్ని చేకూర్చే దిశగా తెలుగుదేశం ప్రభుత్వం క ృషి చేస్తుంది. మూడు దశాబ్దాలుగా మందగతిలో ఉన్న ప్రాజెక్టులు సైతం గత మూడేళ్లుగా వేగాన్ని పుంజుకున్నట్లు వీరు చెప్పారు. ఈ ప్రాజెక్టులు సకాలంలో పూర్తిచేస్తే సాగు, తాగునీటి సమస్య తీరటమే కాకుండా వలసలను అరికట్టే అవకాశం ఉందని సమాఖ్య పేర్కొంది. తెలుగుదేశం ప్రభుత్వం చేపడుతున్న అభివ ృద్ధి పథకాలను దేశ వ్యాప్తంగా ప్రచారం చేసే దిశగా ఈ అధ్యయనం చేపట్టామన్నారు. ఇదే క్రమంలో ఆరోగ్యం, విద్య, పట్టణాభివ ృద్ధి తదితర ఆరు శాఖల ప్రగతిని అధ్యయనం చేస్తామన్నారు. సెప్టెంబరు 3న స్థానిక మారతహళ్లిలో నిర్వహించే కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ నీటిపారుదల శాఖ మంత్రి దేవినేని ఉమకు ప్రాజెక్టులపై చేపట్టిన నివేదికను సమర్పించనున్నారు.

## యజమానుల నుంచి లైసెన్స్‌లు ఇప్పించండి

### పోలీసు కమిషనర్‌కు టాక్సీ డ్రైవర్ల వినతి

కోయంబత్తూరు : వాహనాలు నడిపేటప్పుడు డ్రైవింగ్ లైసెన్స్ ఒరిజినల్ కాపీ దగ్గర ఉంచుకోవాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో తమ లైసెన్స్‌లను వాహన యజమానుల నుంచి ఇప్పించాలని కమిషనర్ అమల్‌రాజ్‌కు టాక్సీ డ్రైవర్లు వినతి పత్రం అందజేశారు. టాక్సీ యజమానులు తమను ఉద్యోగంలోకి తీసుకునేటప్పుడు ఒరిజినల్ డ్రైవింగ్ లైసెన్స్‌లను స్వాధీనం చేసుకోవడం ఆనవాయితీ అని అయితే శుక్రవారం నుంచి ఒరిజినల్ కాపీ తమ వద్ద ఉంచుకోవాలనే నిబంధన ప్రారంభం అవుతుందన్నందున వాటిని ఇప్పించాలని విన్నవించారు.

### రూ. 10 లక్షల విలువైన

# మత్తు పదార్థాల స్వాధీనం

చెన్నై : గుట్కా, ఇతరమత్తు పదార్థాలను రైలులో తరలించడానికి సిద్ధం చేస్తుండగా దాడిచేసి పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్ వాల్‌టాక్స్ రోడ్డు పార్సిల్ కార్యాలయం వద్ద ఒక వ్యాను నిలబడి ఉండగా అనుమానంతో ఎలిఫెంట్ గేట్ పోలీసు ఇన్‌స్పెక్టరు వెంకట్రమణన్ సిబ్బందితో కలిసి ఆ వాహనాన్ని తనిఖీ చేశారన్నారు. అందులో మూటలు కట్టి ఉన్న గుట్కా, ఇతర మత్తుపదార్థాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీటి విలువ రూ.పది లక్షలు ఉంటుందని పోలీసులు పేర్కొన్నారు. విచారణలో వీటిని రైలులో బయటి ప్రదేశానికి తరలించడానికి తీసుకొచ్చినట్లు వాహన డ్రైవరు పేర్కొన్నాడని, ఆ వాహనంలోని డ్రైవరు సీటు వద్ద తనిఖీ చేసి రూ.3.5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. డ్రైవరు ప్రదీప్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు.

# గనుల నగరిలో రంగుల పండుగ

బళ్లారి : గనులనగరి రంగుల పండుగకు వేదికైంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వఛ్ జాబితాలో బళ్లారి 234వ స్థానంలో ఉంది. త్వరలో మరోమారు ప్రకటించబోయే జాబితాలో ఆ స్థానాన్ని మెరుగుపర్చుకోవాలని భావించిన జిల్లా అధికారి డా.రామప్రశాత్ మనోహర్ వివిధ స్వఛఛేద సంస్థల ఆధ్వర్యంలో ఈ ఏడాది మేలో చిత్రకళా ఉత్సవాన్ని ప్రారంభించారు. 30 రోజుల పాటు గోడలపై రంగులు, చిత్రాలు వేసి బళ్లారికి కొత్త అందాన్ని తెచ్చిపెట్టారు. పాలికె ఆరోగ్య శాఖాధికారి నరేంద్ర బదిలీ తర్వాత స్వఛ్ఛభారత్ కార్యక్రమం నిలిచిపోయింది. సెప్టెంబరు 12న ముఖ్యమంత్రి నగర పర్యటన నేపథ్యంలో మరోసారి నగరంలో చిత్రకళా ఉత్సవాన్ని ప్రారంభించారు. స్థానిక హెచ్.ఆర్.గవియప్ప కూడలి సమీపంలో ఉన్న పశుసంవర్ధక శాఖ కార్యాలయం ప్రధాన గోడలకు రంగులు వేసి, విశ్వ పర్యాటక ప్రాంతమైన హంపీ చరిత్రను తెలిపే ఏకశిల రథం, శ్రీకృష్ణదేవరాయలు, విరూపాక్షేశ్వర దేవస్థాన గోపురం, విఠలేశ్వర దేవస్థానం తదితర స్మారకాలను గీసి నగరానికి మరింత వన్నె తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ప్రముఖ చిత్ర కళాకారుడు రఫీక్ నేతృత్వంలో కళాకారులు కుడ్యాలను చక్కగా తీర్చిదిద్దుతున్నారు. ఈ ప్రక్రియ నిరంతరం సాగేందుకు నగర వాసులు చేయూత ఇవ్వాలని, చక్కగా రంగులద్దిన గోడల వద్ద మూత్రవిసర్జతో అపరిశుభ్రం చేయకుండా సహకరిస్తే స్వఛ్ జాబితాలో బళ్లారి స్థానం మెరుగువుతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

# ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



సిమిలిగుడ : సిమిలిగుడకు చెందిన సరస్వతి శిశుమందిర్‌లో ఏర్పాటుచేసిన వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల నమూనాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఉదయం ప్రదర్శనను అధ్యక్షుడు ప్రకాష్‌పాత్ర్ ప్రారంభించగా ప్రధానోపాధ్యాయులు లక్ష్మీప్రియ బెహరా, సైన్స్ ఉపాధ్యాయులు రమణిరంజన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

1వ తరగతి నుంచి 7వ తరగతికి చెందిన 100 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రాజెక్టులను రూపొందించారు. సోలార్ విద్యుత్తు దీపాలు, విద్యుత్తు ఉత్పత్తి, మానవ శరీరం, కాలుష్యం బెడద తదితర ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి బహుమతులను అందించారు.

# యువత మారితేనే దేశాభివృద్ధి

కటక్ : యువతలో దేశభక్తి పెరగాలని, దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహామహులపై యువతలో అవగాహన పెరగాలని, అప్పుడే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని ప్రపంచ గాయత్రి పరివార్, కటక్‌శాఖ ప్రతినిధి సత్యజిత్ మహంతి అన్నారు. గురువారం కటక్‌లో ఉన్న నేతాజీ సుభాష్‌చంద్ర బోస్ జన్మస్థానం నుంచి సేకరించిన మట్టితో వూరేగింపు నిర్వహించారు. ఈ సందరేగా సత్యజిత్ మహంతి మాట్లాడుతూ హరిద్వార్‌లో ఉన్న శాంతికుంజ్ అధిషా‘నం ఆదేశాల మేరకు దేశంలో ఉన్న 2,400 గాయత్రి పరివార్ పీఠాల నుంచి ఈ వూరేగింపు నిర్వహిస్తున్నారన్నారు. దేశంలో ఉన్న మహామహుల నివాస స్థలాల నుంచి మట్టి సేకరించి దానితో వూరేగింపు నిర్వహించి హరిద్వార్ చేర్చు తారన్నారు. అనంతరం అన్ని ప్రాంతాల నుంచి హరిద్వార్‌కు చేరిన మట్టిని కలిపి నాలుగు రథాలను ఏర్పాటు చేసి ఈ మట్టిని రథాలపై ఉంచి దేశవ్యాప్తంగా వూరేగింపులు నిర్వహిస్తా మన్నారు. పలు ప్రాంతాల్లో యువ సమావేశాలు నిర్వహించి మహామహుల త్యాగాలపై చర్చించి యువతలో చైతన్యం కల్పిస్తామన్నారు. నేతాజీ జన్మస్థానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ప్రజా సమాచార అధికారి మీనకేతన్ బెహర, కటక్ నగర శాంతి కమిటీ అధ్యక్షుడు దేవేంద్రనాథ్ సాహు, కార్యదర్శి బికారి దాస్ పాల్గొన్నారు.

### కృత్రిమ కాంతి సృష్టిలో

# మరిన్ని ఆవిష్కరణలు అవసరం





బెంగళూరు : మారుతున్న ఆధునిక జీవనశైలి నేపథ్యంలో సహజమైన వెలుగు అందు బాటులో లేకుండా పోతుంది. ఆధునిక మానవుడి నిత్యావసరాలు తీరాలంటే క ృత్రిమ కాంతి ఆవశ్యకత పెరిగిందని భారతీయ విజ్ఞాన సంస్థ (ఐఐఎస్‌సీ) నివృత్త భౌతికశాస్త్ర ఆచార్యులు డా.హెచ్‌ఎల్.భట్ అన్నారు. ఆయన గురువారం స్థానిక విశ్వేశ్వరయ్య పారిశ్రామిక సాంకేతిక వస్తు సంగ్రహాలయం (వీఐటీఎం)లో కాంతి-మహత్వంపై నిర్వహించిన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని కృత్రిమ కాంతి ఆవిష్కారాల్లో సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాలుష్య నియంత్రణ మార్గదర్శకాలు పాటిస్తూనే సరికొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టాలని సూచించారు. భౌతిక శాస్త్రంలో ఆవిష్క ృతమైన పరిశోధనలు మారుతున్న జీవన విధానానికి అనుగుణంగా రూపాంతరం చెందాయన్నారు.

నగరానికి చెందిన విజ్ఞాన అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కాంతి విభాగంలోని ఆవిష్కరణలు, శాస్త్రజ్ఞుల సమగ్ర సమాచారంతో ప్రదర్శన ఏర్పాటు చేశారు.

# భూసార పరీక్షలపై క్షేత్ర పర్యటనతో అవగాహన

సిమిలిగుడ : ఒడిశా భూసార సంరక్షణ విభాగాధికారులు క్షేత్రపర్యటనలో భాగంగా కొరాపుట్ జిల్లాలో పర్యటించారు. ఇందులో భాగంగా భూసార సంరక్షణ విభాగంలో కొత్తగా చేరిన ఉద్యోగులు క్షేత్రపర్యటనకు వచ్చి వ్యవసాయ, ఉద్యానవనం, విభాగాల పని తీరును పరిశీలించారు.

సునాబెడలోని ఐసీఖిఆర్ సంస్థకు 45 మంది అధికారుల బృందం వచ్చి ఈ కేంద్రం పనితీరును పరిశీలించి అవగాహన పెంచుకున్నారు. అలాగే ఇక్కడి వ్యవసాయ శాస్త్రవేత్తలతో మాట్లాడి సాగు, భూసార పరీక్షలపై పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఐసీఆర్ కేంద్రం డ్కెరెక్టర్ ఎం.మధు, శాస్త్రవేత్తలు ధృభచరణ్‌సాహు తదితరులు బృందాన్ని కేంద్రం, పరిశోధన కేంద్రాలకు తీసుకువెళ్లారు. అధికారులు ఇచ్చిన సూచనలు ఎంతగానో ఉపయోగపడతాయని వారు తెలిపారు.

### కార్యాలయాల్లో

# వేధింపుల నియంత్రణ సమితిని రచించాలి

రాయచూరు : ప్రభుత్వ కార్యాలయాల్లో పది మంది అంతకంటే ఎక్కువ మంది సిబ్బంది పనిచేస్తుంటే మహిళలు, యువతులపై వేధింపులు, దౌర్జన్యాల, అత్యాచారాల నియంత్రణకు సమితిని రచించాలని సదరు సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఉగ్రప్ప సూచించారు. ఆయన జిల్లాధికారి సభాం గణంలో వివిధ శాఖల ప్రగతిని పరిశీలించి మాట్లాడారు. చాలా శాఖాల్లో ఇంతవరకు సమితులను రచించక పోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి సెప్టెంబరు చివరికి రచించిన సమితులపై నివేదిక పంపాలని కోరారు.

సమితిలో 50 శాతం మంది మహిళలకు అవకాశం కల్పించాలన్నారు.

బాధితులకు న్యాయం అందించడం, పరిహారం చెల్లింపు, నిందితులకు శిక్ష పడటంలో సరైన చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్భయ చట్టంలో నమోదైన 12 కేసులకు సంబంధించి బాధి తులకు సక్రమంగా పరిహారం అందించాలని కోరారు. జడ్పీ సీఈవో హెప్సిబా రాణి కొర్లపాటి, ఎమ్మెల్సీ శరణప్ప పాల్గొన్నారు.

**మొదటి పేజీ తరువాయి**

## కాకినాడ పీఠంపై టీడీపీ విజయకేతనం

కులమతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేందుకు విపక్షాలు ప్రయత్నించా యనీ, సంక్షోభాన్ని సృష్టించాలని చూసినా ప్రజలు నమ్మలేదన్నారు. వ్యవసాయంలో రాష్ట్రం నం 1గా ఉందని సీఎం అన్నారు. విపక్షాల బెదిరింపులకు తాను భయపడితే పట్టిసీమ నిర్మాణం పూర్తయ్యేది కాదని చెప్పారు. నీళ్లు లేకపోతే డెల్టా ఎడారిలా మారిపోయేదన్నారు. తనకు ఉన్న అవకాశాలను వినియోగించుకొని రాష్ట్ర అభివృద్ధికి కృషిచేస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వాలు ఇస్తోన్న ప్రోత్సాహం వల్లే తెలుగు యువత క్రీడల్లోనూ అద్భుతమైన విజయాలను అందుకుంటున్నారని ప్రశంసించారు. ఐదేళ్లకొకసారి మాత్రమే ఎన్నికలు రావాలని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో సుస్థిరమైన అభివృద్ధి నిరంతరాయంగా కొనసాగాలన్నారు. మొన్న నంద్యాల ఉప ఎన్నిక, ఈ రోజు కాకినాడ పురపాలక ఎన్నికల్లో తమ పార్టీ శ్రేణులు బాగా పనిచేశాయని ప్రశంసించారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు అని తేడాలేకుండా అంతా సాధారణ కార్యకర్తల్లాగే పనిచేశారని కొనియాడారు.

**టెక్సాస్‌లో తెలుగువాళ్లకు సాయం చేస్తాం..**

అమెరికాలో టెక్సాస్‌ను వరదలు తీవ్ర అతలాకుతలం చేశాయని, అక్కడ ఉండే తెలుగువాళ్లు రోడ్డున పడే పరిస్థితి తలెత్తిందని సీఎం అన్నారు. వారికి అన్ని విధాలా ప్రభుత్వం తరపున, పార్టీ తరపున సాయం చేస్తామని ప్రకటించారు. ఇప్పటికే తమ పార్టీ ఎన్‌ఆర్‌ఐ విభాగం నేతలతో మాట్లాడామన్నారు. వరద ముంపు ప్రాంతాల్లో చిక్కుకున్న ప్రవాసీయులను ఎలా ఆదుకోవాలనే అంశంపై ఓ నిర్ణయం తీసుకుంటామన్నారు. వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు.

## కేఎంసీ దేశం కైవశం

భాజపా కూటమి అత్యధిక స్థానాలను కైవసం చేసుకొని విజయ ఢంకా మోగించింది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ఆధిక్యంలో దూసుకుపోయిన తెదేపా కూటమి అభ్యర్థులు 35 స్థానాల్లో (భాజాపా 3) గెలుపొందారు. మరోవైపు ప్రధాన ప్రతిపక్షమైన వైకాపా 10స్థానాల్లో విజయం సాధించింది. ఇతరులు మూడు స్థానాల్లో గెలుపొందారు.

ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభమైంది. లెక్కింపు కోసం రంగరాయ వైద్య కళాశాలలో 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఆగస్టు 29న జరిగిన నగరపాలక ఎన్నికల్లో మొత్తం 48 డివిజన్లకు సంబంధించి 241 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మొత్తం 1,48,598 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## అందరికీ సమస్కారం

తిరుపతి కావడం ఆనందంగా ఉందని భారత రాష్ట్రపతి కోవింద్ చెప్పారు. ఏపీ దేశానికి ఎంతో సేవ చేసిందని తెలిపారు. కేంద్రం నవ్యాంధ్ర అభివ ృద్ధికి బాగా సహకరిస్తోందని చెప్పారు.

చంద్రబాబు మాట్లాడుతూ తాను చదువుకున్న ఎస్వీయూకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ రావడం తనకు ఆనందంగా ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంలాగే రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ జీవితం విద్యార్థులకు ఆదర్శమని అన్నారు. ఓ పేద కుటుంబంలో పుట్టిన రామ్‌నాథ్ కోవింద్ ఎన్నో కష్టాలు ఎదుర్కొని ఇప్పుడు అత్యున్నత పదవిని అలంకరించారన్నారు.

**ప్రజాస్వామ్య దేశం ప్రత్యేకత**

ఒక సాధారణ మనిషిని దేశ అత్యున్నత పదవిలో నిలబెట్టడం ప్రజాస్వామ్య దేశ ప్రత్యేకత అని చెప్పారు. దేశానికి రాష్ట్రపతి అయినా ఆయన ఎంతో వినమ్రతతో ఉంటారని చంద్రబాబు అన్నారు. కొంతమంది వ్యక్తులు ఏ పదవి అలంకరించినా ఆ పదవికి వన్నె తెస్తారని, అందులో రామ్‌నాథ్ కోవింద్ ఒకరన్నారు. తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కళాశాల మైదానంలో రాష్ట్రపతి కోవింద్‌కు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏర్పాటు చేసిన పౌర సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ నరసింహన్, మంత్రులు అచ్చెన్నాయుడు, లోకేశ్, అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి శుక్రవారం తిరుమలకు చేరుకుని రాత్రికి అక్కడే బస చేస్తారు. శనివారం ఉదయం శ్రీవారిని దర్శించుకుంటారు. ఉదయం 11 గంటలకు తిరుపతి నుంచి ప్రత్యేక విమానంలో ఆయన ఢిల్లీకి బయల్దేరి వెళతారు.

## కేబినెట్ విస్తరణకు ముహూర్తం ఖరారు..

మందిని మంత్రివర్గం నుంచి తప్పించి పార్టీ బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఇప్పటికే అయిదుగురు మంత్రులు రాజీనామా సమర్పించారు.

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ రెండు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం శుక్రవారం (సెప్టెంబర్ 1) మధ్యాహ్నం తిరుపతికి విచ్చేశారు. శనివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆయన ఢిల్లీకి బయలుదేరి వెళతారు. ఈ నేపథ్యంలో కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారానికి ఆదివారం ఉదయం ముహూర్తం ఖరారు చేసినట్టు అధికార వర్గాలు టైమ్స్ ఆఫ్ ఇండియాకు తెలిపాయి.

## రికార్డుల ప్రక్షాళనతో వివాదాలకు చరమగీతం

పదాలు పొందుపర్చాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఐదెకరాలకు పైబడిన భూములకు సంబంధించిన సాదాబైనామాలను కూడా కలెక్టర్ అనుమతితో క్రమబద్ధీకరించాలని చెప్పారు. ప్రపంచంలో ఎక్కడ ఏటీఎంలో డబ్బు డ్రా చేసినా ఆన్‌లైన్‌లో ఖాతా అప్‌డేట్ అయ్యే పద్ధతిలో భూమి క్రయవిక్రయాలు కూడా అప్పటికప్పుడు అప్‌డేట్ కావాలని అన్నారు. భూమి రికార్డుల ప్రక్షాళన, సరళీకరణ, నవీకరణలపై ప్రగతిభవన్‌లో కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఆర్డీవోలతో సీఎం కేసీఆర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి రికార్డులను సమగ్రంగా ప్రక్షాళన చేసి, రైతులకు పక్కాగా పట్టాదార్ పాసుపుస్తకాలు అందించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఏ భూమి ఎవరి ఆధీనంలో ఉందో తేల్చి, భూమి హక్కులపై స్పష్టత ఇవ్వాలన్నారు.

అలాగే భూములు- వాటి యజమానుల వివరాలను పంచాయతీ గోడలపైన, ప్రభు త్వ పాఠశాలల గోడలపైన రాయాలని స్పష్టంచేశారు. భవిష్యత్‌లో రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా రికార్డులను ప్రక్షాళన చేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని వచ్చే మూడు నెలల్లో పూర్తిచేయాలని, అప్పటివరకు కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు ఈ పనిమీదే ఉండాలని సీఎం సూచించారు. రికార్డుల ప్రక్షాళనకు ప్రతి కలెక్టరుకు రూ.50 లక్షల నిధులు ఇస్తున్నామని సీఎం తెలిపారు. రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం ఆసాంతం నిర్వహించే బాధ్యత జిల్లా కలెక్టర్లదేనని, వారే బృందాలను ఏర్పాటుచేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాగా పనిచేసే కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు తదితరులకు ప్రోత్సాహకాలు ఇస్తామని సీఎం ప్రకటించారు.

ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఉంటున్న రెవెన్యూ అధికారులు తమ ప్రాథమిక విధి అయిన భూముల నిర్వహణను నిర్లక్ష్యం చేయాల్సి వచ్చిందని సీఎం అభిప్రాయపడ్డారు. భూమి రికార్డుల నిర్వహణ సరిగ్గా లేకపోవడం అనేక వివాదాలకు, గందరగోళానికి, ఘర్షణలకు దారితీసిందని చెప్పారు. రికార్డుల ప్రక్షాళన ద్వారా అన్ని వివాదాలకు చరమగీతం పాడాలని సీఎం సూచించారు.రైతుకు కావాల్సింది సాగునీరు, పెట్టుబడి, పండించిన పంటకు గిట్టుబాటు ధర అని అన్నారు. రైతులకు సాగునీరు అందించడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని, పెట్టుబడికోసం ఎకరాకు ఏడాదికి రూ.8 వేలు వచ్చే ఏడాదినుంచి ఇస్తున్నామని, గిట్టుబాటు ధర రైతుకు అందించడం కోసం రైతు సమన్వయ సమితులు ఏర్పాటు చేస్తున్నా మని వివరించారు. అయితే పెట్టుబడి ఇచ్చే పథకానికి భూమి రికార్డులు సరిగ్గా లేకపోవడంతో అనేక ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిజమైన రైతుల అకౌంట్లలో డబ్బులు జమ కావాలంటే భూమి రికార్డులు పక్కాగా ఉండాలని చెప్పారు. ఇదే సమయంలో బ్యాంకులు పెట్టుబడి ఇవ్వడానికి పట్టాదార్ పాసుపుస్తకాలు కుదువ పెట్టాల్సిన పనిలేదని అన్నారు. ఇక నుంచి బ్యాంకులు అడిగితే ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలని స్పష్టంచేశారు. పక్కాగా రూపొందించిన రికార్డులను ఆన్‌లైన్‌లో చూసుకొని బ్యాంకులు రుణాలు ఇవ్వాలన్నారు. అలాగే రైతులు సమావేశమై ఒకరి ఆలోచనలు మరొకరు పంచుకోవడానికి 2600 క్లస్టర్లలో రైతు సమావేశ మందిరాలను నిర్మించాలని సీఎం నిర్ణయించారు.

**సీఎం కేసీఆర్ చేసిన సూచనలు**

-ఐదెకరాలకు పైబడిన భూములకు సంబంధించిన సాదాబైనామాలను కూడా కలెక్టర్ అనుమతితో క్రమబద్ధీకరించాలి. పాత దరఖాస్తుదారుల నుంచి సాదాబైనామా రాసుకున్న తేదీ నాటి రేటుతో రిజిస్ట్రేషన్ చేయాలి.

-భూమి శిస్తు రద్దు చేసినందున భూమి రకాలను వర్గీకరించాల్సిన అవసరం లేదు. గరిష్ఠ భూ పరిమితి చట్టం ప్రకారం వర్గీకరించిన భూముల వివరాలను యథాతథంగా కొనసాగించాలి.

-అసైన్డ్ ల్యాండ్స్ విషయంలో వీలైనంత గరిష్ఠస్థాయిలో క్లియర్ చేయాలి. భూ యాజమాన్య హక్కులు కల్పించాలి. వ్యవసాయం చేసుకునే వారికి యాజమాన్య హక్కులు ఇవ్వాలి.

-కోర్ బ్యాంకింగ్ తరహాలో భూమి రికార్డుల నిర్వహణ ఉండాలి. ప్రపంచంలో ఎక్కడ ఏటీఎంలో డబ్బులు తీసుకున్నా, వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌డేట్ అయి వెంటనే సమాచారం వస్తుంది. కోట్లాది ఖాతాలు నిర్వహించే బ్యాంకులలో సాధ్యమైన ఈ పద్ధతి 55 లక్షల రైతులకు సంబంధించిన రికార్డుల నిర్వహణలో అనుసరించాలి.

-గ్రామ కంఠం పరిధి, హద్దులను నిర్ణయించాలి.

-అంకితభావంతో చేసే ఏ పనైనా విజయవంతం అవుతుంది. అధికారులు భూమి రికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని కేవలం ప్రభుత్వ కార్యక్రమం మాదిరిగా కాకుండా, పితృ వాత్సల్యంతో నిర్వహించాలి.

-తెలంగాణలో వ్యవసాయాన్ని పండుగ చేయాలి. అందుకు రైతు సమన్వయ సమితులదే ప్రధాన భూమిక. రైతు సమన్వయ సమితి సభ్యులు 1.75 లక్షల మంది ఉంటారు. అదొక సైన్యం. రైతులను సంఘటిత శక్తిగామార్చి రైతుల కోసం చేసే కార్యక్రమాలను నిర్వహిస్తాం.

# హైదరాబాద్ ప్రాంతీయ వార్తలు

## నాలుగు జిల్లాలకు తెదేపా కొత్త సారథులు

అదిలాబాద్ : తెలుగుదేశం పార్టీకి కొత్త రథసారథులు వచ్చారు. జిల్లాల పునర్విభజన తర్వాత నూతన అధ్యక్షుల నియామకంలో జరుగుతున్న జాప్యానికి ఎట్టకేలకు తెరపడింది. తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు తెలంగాణలో జిల్లాలవారీగా అధ్యక్షులను ప్రకటించారు. ఆదిలాబాద్ జిల్లాకు బోథ్ మాజీ ఎమ్మెల్యే సోయం బాపురావు, నిర్మల్‌కు ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడిగా వ్యవహరించిన లోలం శ్యాంసుందర్, మంచిర్యాలకు మాజీ మంత్రి బోడ జనార్దన్, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకు కాగజ్‌నగర్‌కు చెందిన జి.ఆనంద్ నియమితులయ్యారు. గోండు వర్గంలో మంచి పట్టున్న సోయం బాపురావును ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. వచ్చే ఎన్నికల వరకు వీరంతా అధ్యక్షులుగా ఉండి పార్టీని ముందుకు నడిపించనున్నారు. ఇప్పటివరకు జిల్లాల వారీగా అధ్యక్షులు లేకపోవడంతో పార్టీశ్రేణులను సమన్వయం చేసేవారు కరవయ్యారు. తాజాగా అధ్యక్షుల నియామకంతో పార్టీ బలోపేతం కానుంది. కార్యకర్తల్లోనూ నూతనోత్తేజం కనిపించనుంది.

## నిర్మాణ జాప్యాన్ని నిరసిస్తూ రహదారి దిగ్బంధం



ఖమ్మం : బోనకల్, అల్లీపురం రోడ్డు నిర్మాణంలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో రోడ్డు దిగ్బంధం కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదట జడ్పీ సెంటర్‌లో నిరసన తెలిపిన అనంతరం బోనకల్ రోడ్డులో ప్రదర్శనగా బయలు దేరిన సీపీఐ బృందం సంభానీనగర్ గుండా అల్లీపురం కూడలి వద్దకు చేరుకుని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి బాగం హేమంతరావు మాట్లాడుతూ అత్యంత రద్దీగా ఉండే బోనకల్ రోడ్డులో విస్తరణ పనులు ప్రారంభించి వాటిని మధ్యలోనే వదిలేయడంతో రోడ్డు దారుణంగా తయారయిందని, దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని, దుమ్మూధూళి ఇళ్లల్లోకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. అదేవిధంగా అల్లీపురం రోడ్డు నిర్మాణంలో కూడా తీవ్ర జాప్యం జరుగుతుందని దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజలు ఇంత తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నా పాలకవర్గం ఏమాత్రం పట్టించుకోవట్లేదని, నగరం పురపాలకంగా ఉన్నప్పుడే పరిస్థితి బాగుందని, ఇప్పుడు అభివృద్ధి పేరుతో రోడ్లను ఎక్కడపడితే అక్కడ ఇష్టారీతిన తవ్వుతున్నారని దీంతో ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. తక్షణమే స్పందించకపోతే ఆందోళనలను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శులు ఎస్కే.జానిమియా, బిజి క్లెమెంటు, తాటి వెంకటేశ్వర్లు, సాంబశివరెడ్డి, ఏనుగు గాంధీ, మందా వెంకటేశ్వర్లు, యాకూబ్, రామకృష్ణ, అశోక్, మేకల శ్రీనివాసరావు, వెంకన్న, మాలకొండయ్య, శ్రీను, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

## వీఆర్వోల సమస్యల పరిష్కారానికి కృషి: తుమ్మల



ఖమ్మం : ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసే వీఆర్వోల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ర.భ.శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారని తెలంగాణ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేందర్‌రావు తెలిపారు. మంత్రి తుమ్మలను ఖమ్మంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో వీఆర్వోలు కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సాదాబైనామా విజయవంతంలో వీఆర్వోలది కీలకపాత్ర అన్నారు. రైతులకు ప్రభుత్వం అందించే రూ.4వేల ప్రోత్సాహకంలో అందరు రైతులకు న్యాయం జరిగేలా చూడాలని వీఆర్వోలకు సూచించారు. నెల రోజులలో సమావేశం ఏర్పాటు చేసి వీఆర్వోల సమస్యలను ముఖ్య మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేందర్‌రావు, నాయకులు సున్నం రామారావు, షేక్ నాగులు మీరా, ధరావత్ భాస్కర్, భూక్యా శ్రీను, బి.ఎం నరసింహారావు, చీమల నాగేంద్రబాబు, రాజరత్నం, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో పండగలు చేసుకోవాలి

అదిలాబాద్ : ప్రశాంత వాతావరణంలో పండగలు జరపాలని ఆదిలాబాద్ జిల్లా పోలీసు ఉన్నతాధికారి శ్రీనివాస్ అన్నారు. బక్రీద్, గణేష్ నవరాత్రులు ఏకకాలంలో వచ్చిన నేపథ్యంలో సాయుధ పోలీసు ప్రాంగణంలోని సమావేశ మందిరంలో ముస్లీం మతపెద్దలు, పురపాలక, పోలీసు అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ఎవరి ఆచారాల ప్రకారం వారు పండగలు నిర్వహించాలని, ఒకరినొకరు రెచ్చగొట్టేలా వ్యవహరించొద్దని చెప్పారు. ఆవులు, దూడల విక్రయాలు జరగకుండా అన్ని సరిహద్దు చెక్‌పోస్టుల్లో నిఘా ఏర్పాటుచేశామన్నారు. ఆవులు, దూడలను వధించడం చట్టరీత్యా నేరంగా పరిగణిస్తున్నందున అలాంటి చర్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో శంకర్, డీఎస్పీ లక్ష్మీనారాయణ, పురపాలక కమిషనర్ మారుతీ ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు జగదీశ్వర్‌గౌడ్, అయాజ్, పట్టణ సీఐలు సురేష్, స్వామి, తహసీల్దార్ వర్ణ తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలను అతిక్రమిస్తే చర్యలు తప్పవు

ఇచ్చోడ : చట్టాలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఉట్నూర్ డీఎస్పీ చంద్రప్రభు అన్నారు. ఆయన ఇచ్చోడలోని పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఉంటుందని, సీసీ కెమెరాలు సైతం అన్ని ప్రధాన కూడళ్లలో ఉండడంతో అందరు నిఘా నీడలో ఉంటారని గుర్తు చేశారు. ఉత్సవాలను శాంతియుతంగా భక్తి శ్రద్ధలతో జరుపుకొని విజయవంతం చేయాలన్నారు. రెచ్చగొట్టె పాటలను ఉత్సవాల్లో పెట్టకుండా భక్తిపరమైన పాటలతో శోభయాత్ర కొనసాగించాలన్నారు. రహదారులన్ని గుంతలమయమై ఉన్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు. నిమజ్జన ఏర్పాట్లను పంచాయతీ వారు చేయించాలని డీఎస్పీ వారికి సూచించారు. నిర్వాహకులు, గ్రామ నాయకుల అభిప్రాయాలు, సలహాలు తీసుకున్నారు. ఐదు గణేశ్ మండళ్ల విద్యుత్తు ఛార్జీలు రూ.5వేలు చెల్లిస్తామని వైస్ ఎంపీపీ దేవానంద్ ప్రకటించారు. విగ్రహాలను క్రేన్ సహాయంతో ఎత్తెందుకు బల్ల నిర్మాణానికి తనవంతుగా రూ.3వేలు ఇస్తానని మానవహక్కుల కార్యకర్త అంబేకర్ పాండురంగ్ తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాథోడ్ మోహన్‌సింగ్, సీఐ సతీశ్‌కుమార్, ఎస్సై డి.మోహన్, ఎక్సైజ్ సీఐ రాజమల్లు, విద్యుత్తు ఏఈ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జానపద జాతర

మెదక్ : పోతరాజుల నృత్యాలు... బోనాలు, బతుకమ్మతో మహిళల సందడి... పల్లెసుద్దులతో జానపద జాతర ఘనంగా జరిగింది. ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక టీఎన్జీవో భవనంలో జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో జానపద జాతర నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లాకు చెందిన కళాకారులు, సాంస్కృతిక శాఖ కళాకారులు నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పల్లెసుద్దులు, బుర్రకథ, చిందుయక్షగానం, డోలుడప్పుతో సందడి చేశారు. జానపద కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ మాట్లాడుతూ.. పల్లె కళలను కాపాడేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు.

అనంతరం కళాకారులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాకారుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ప్రసాద్, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, కళాకారులు నాగరాజు, ఎల్లం, యాదగిరి, సాయిలు, మురళి, సిద్దు, ధనలక్ష్మి పాల్గొన్నారు.

## ఉద్యోగుల కృషితోనే బంగారు తెలంగాణ



గజ్వేల్ : ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో టీఎన్జీవోల పాత్ర మరువలేనిదని.. ఇప్పుడు అదే స్ఫూర్తితో బంగారు తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు కావాలని శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్ అన్నారు. సాంఘిక సంక్షేమ వసతిగృహాల అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, టీఎన్జీవో ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు ఎల్.శ్రీనివాస్‌రెడ్డి ఉద్యోగవిరమణ సందర్భంగా గజ్వేల్‌లోని కోలాభిరాం గార్డెన్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలు చెల్లిస్తున్న పన్నులను జీతం రూపంలో తీసుకుంటున్న ఉద్యోగులు వారికి ఇబ్బంది కలిగించే ఎలాంటి చర్యలకు పూనుకోద్దన్నారు. ఉద్యోగులు సమ్మెలు చేస్తే ప్రజలు ఇబ్బందులకు గురవుతారన్నారు. తెలంగాణ ఉద్యమంలో 42 రోజుల పాటు వసతిగృహాల్లోని విద్యార్థులకు భోజనాలు పెడుతూనే రాష్ట్రం కోసం సమ్మె చేపట్టి ఉద్యోగ హాజరు వేసుకోకుండా పనిచేసిన ఘనత వార్డెన్‌లకు దక్కిందన్నారు. మెదక్ ఎంపీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యా సంస్కరణలోనూ టీఎన్జీవోలు కీలకంగా మారాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎడ్యుకేషన్ హబ్‌లు తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని ఇందుకు తొలిమెట్టుగా గజ్వేల్ నుంచే ప్రారంభించారన్నారు. రేయింబవళ్లు విద్యార్థుల బాగోగులు చూస్తూ పనిచేసే వార్డెన్‌లు రానున్న రోజుల్లో కూడా మరింత సమర్థవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీఎంవో ప్రత్యేకాధికారి దేశపతి శ్రీనివాస్, బేవరేజ్ కార్పొరేషన్ ఛైర్మన్ దేవీప్రసాద్, టీఎన్జీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్ర రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాంరావు, రాష్ట్ర నాయకురాలు రేజల్, మనోహరి, జిల్లా నాయకులు రాజేశం, లింగం, శ్రీధర్ పాల్గొన్నారు.

## చెరువు కట్టుకాల్వలో చెత్త పారబోత

వెల్దుర్తి : తూప్రాన్ పట్టణంలో ప్రతిరోజు సఫాయి కార్మికులు సేకరించే చెత్తను వెల్దుర్తి మండలం మాసాయిపేట రామప్ప చెరువు కట్టుకాల్వలో పారబోస్తున్న సంఘటన వెలుగులోకి వచ్చింది. దీనిపై వెల్దుర్తి మండలం మాసాయిపేట, స్టేషన్‌మాసాయిపేట, తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు తూప్రాన్ ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. స్టేషన్‌మాసాయిపేటకు చెందిన తెరాస జిల్లా నాయకుడు స్టేషన్‌శ్రీను మాట్లాడుతూ.. తూప్రాన్ పట్టణంలో ప్రతిరోజు పోగయ్యే సుమారు 40 ట్రాక్టర్ల చెత్తను గత కొన్ని రోజులుగా ఇస్లాంపూర్ పరిధి నుంచి మాసాయిపేట రామప్ప చెరువులోకి వచ్చే కట్టుకాల్వలో పారబోస్తున్నారన్నారు. తామంతా వెళ్లి చూడగా చెరువులోకి వరద నీరు వచ్చే కాల్వ మొత్తం చెత్తతో పూడుకుపోయి ఉందన్నారు. వర్షం కురిసినప్పుడు ఈ చెత్త మొత్తం వరదనీటితో పాటే రామప్ప చెరువులోకి వచ్చి చేరుతుందన్నారు. 44వ జాతీయ రహదారి పక్కనే ఉన్న ఈ చెరువు కలుషితంగా మారడంతో పాటు చెరువులో చేపల పెంపకానికి విఘాతం కలుతుందన్నారు. తక్షణం తూప్రాన్ గ్రామ పంచాయతీ బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు పారబోసిన చెత్తను తొలగించాలని కోరారు.

## ఉద్యమం.. అభివృద్ధి రెండింటా సిద్దిపేట ఆదర్శం



సిద్దిపేట : ప్రజల భాగస్వామ్యంతోనే నాడు తెలంగాణ ఉద్యమంలో.. నేడు అభివృద్ధిలో సిద్దిపేట ఆదర్శంగా నిలుస్తుందని రాష్ట్రమంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేటలో రూ.20కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 300 పడకల ఆస్పత్రిలో ఓపీ సేవల బ్లాక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. జిల్లాకేంద్రంలో ఏర్పాటవుతున్న వైద్యకళాశాల వల్ల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. త్వరలోనే కేంద్ర బృందం పరిశీలనకు రానుందని.. ఈ లోపలే యుద్ధప్రాతిపదికన పనుల్ని పూర్తిచేయిస్తామని చెప్పారు. ఇక్కడి ఆస్పత్రిలోని సేవల్ని వినియోగించుకోవాలని.. ఒకప్పుడు 10 మంది వైద్యులుండే ఆస్పత్రి రూపురేఖలు మారాయన్నారు. ప్రస్తుతం 100 మంది వైద్యుల పర్యవేక్షణలో అన్ని రకాల వైద్యసేవల్ని అందిచనున్నట్లు మంత్రి తెలిపారు. కొత్త భవనం ప్రారంభోత్సవం తరువాత పక్కనే ఉన్న జిల్లాసుపత్రిలో అందుతున్న సేవల తీరుపై ఆరాతీశారు. అంతకుముందు బీజేఆర్ చౌరస్తా వద్ద మాజీ వైస్‌చైర్మన్ వెంకటేశ్వర్‌రావు రూ.3లక్షలతో ఏర్పాటు చేయించిన ఓపెన్ వ్యాయామశాలను మంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా అక్కడి పరికరాలను పరిశీలించిన మంత్రి వ్యాయామ కసరత్తును చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యువత ఆరోగ్యంపై శ్రద్ధను చూపించాలని హితవు పలికారు. ఏ కొత్త కార్యక్రమాన్ని అయినా.. సిద్దిపేట నుంచే పునాది వేస్తున్నామని.. అమలులోనూ ముందువరుసలో నిలుస్తున్నామన్నారు. ప్రత్యేక అభివృద్ధి నిధుల ద్వారా గ్రామానికి అందించిన పనుల్లో వేగాన్ని పెంచాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి పలు గ్రామపంచాయతీలకు చెత్త తరలింపు కోసం వినియోగించే బ్యాటరీ ద్వారా నడిచే వాహనాలను అందజేశారు. కార్యక్రమంలో బల్దియా అధ్యక్షుడు రాజనర్సుతోపాటు జిల్లా వైద్యాధికారి ప్రవీణ్‌చందర్, జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త జగన్నాథరెడ్డి, ప్రతిపాదిత వైద్యకళాశాల డైరెక్టర్ తమిల్ అరసి తదితరులు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోళ్లకు సీసీఐదే భారం..



ఆదిలాబాద్ : దేశవ్యాప్తంగా పత్తి సాగు పెరిగింది. దిగుబడులు ఎక్కువగా వచ్చే అవకాశముంది. మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు భారత పత్తి సంస్థ (సీసీఐ) కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఉమ్మడి జిల్లా మొత్తంలో 24 కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మద్దతు ధర కంటే విపణిలో తక్కువగా ఉంటే రైతులకు మద్దతు ధర కల్పించేందుకు వీలుగా కొనుగోలు చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. అనేక ఆంక్షలతో రైతులను ముప్పుతిప్పలు పెట్టే సీసీఐ చివరి వరకు రైతులకు అండగా నిలుస్తుందా లేదా అనేది సందేహమే. పత్తి పంటకు ధర ఉంటుందోలేదో అనే ఆందోళన అన్నదాతలను కలవరపరుస్తుంది. దేశ వ్యాప్తంగా గతంలో ఎన్నడూ లేని విధంగా పత్తి సాగు కావడం ధరలపైన తీవ్ర ప్రభావం చూపుతోందనే వూహాగానాలు అన్నదాతలను అయోమయానికి గురిచేస్తుంది. గతేడాదిలో పరుగులు పెట్టి కొనుగోలుచేసిన వ్యాపారులు ఆ తర్వాత ధర పడిపోవడంతో నష్టపోవాల్సి వచ్చింది. దీంతో ఈ సారి పత్తి కొనుగోళ్లకు ప్రైవేటు వ్యాపారులు ఆసక్తి చూపరని భావిస్తున్నారు. కొనుగోళ్లకోసం ప్రభుత్వ రంగసంస్థ అయిన సీసీఐపైనే ఆధారపడాల్సి ఉంటుంది. మరో నెల రోజుల్లో పత్తి కోతకు వస్తుండటంతో సీసీఐ ద్వారా కొనుగోళ్లకు అధికారయంత్రాంగం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. పత్తికొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లానే కాకుండా దేశవ్యాప్తంగా పత్తి పంటను భారీగా సాగుచేశారు. గత పత్తి సీజన్‌లో పత్తికి డిమాండ్ ఉండటంతో ప్రైవేటు వ్యాపారులే పోటీపడి కొనుగోలు చేశారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) రూ.4160 ఉండగా.. ప్రైవేటు వ్యాపారులే రూ.6వేల వరకు కొనుగోలు చేశారు. దీంతో ఆ ఏడాదిలో పత్తి కొనుగోళ్లకు సీసీఐ అవసరం రాలేదు. ప్రస్తుతం కూడా పత్తి ధర ఆశించిన మేరకు లేకపోయింది. ప్రతి ఏటా రూ.50 నుంచి రూ.100 వరకు పెరిగే కనీస మద్దతు ధర ఈ సారి రూ.160వరకు కేంద్ర ప్రభుత్వం పెంచింది. ప్రభుత్వం ఈ సీజన్‌కు క్వింటా పత్తి కనీస మద్దతు ధర రూ.4320కి పెంచింది. అయినా.. ఈ ధర గతేడాదిలో ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేసినదానితో పోల్చితే చాలా తక్కువే అని చెప్పవచ్చు. ఓ వైపు కురుస్తున్న వర్షాలు పత్తి పంట ఏపుగా వస్తున్నా.. ఆశించిన స్థాయిలో ధర ఉండదనే ప్రచారం రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది.

బయట మార్కెట్‌లో పత్తికి ధరలు పడిపోవడంతో రైతులకు కనీస మద్దతు ధరను ఇప్పించడానికి కేంద్రం ఈ సారి సీసీఐను రంగంలోకి దించనుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 24సీసీఐ కేంద్రాల ఏర్పాటు చేయడానికి జిల్లా అధికారయంత్రాంగం ప్రణాళిక రూపొందించింది. ఆదిలాబాద్ జిల్లాలో ఆదిలాబాద్‌లో రెండు, బోథ్, సోనాల, నేరడిగొండ, పొచ్చర, ఇంద్రవెల్లి, ఇచ్చోడ, నార్నూర్,బేలలో సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి రంగం సిద్ధం చేశారు. అదే విధంగా మంచిర్యాల జిల్లాలో చెన్నూర్, లక్సెట్టిపేట, మంచిర్యాల, ఇందారం, బెల్లంపల్లి ప్రాంతాల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలనే ఏర్పాటు చేయనున్నారు. కుమురంభీం జిల్లాలో ఆసిఫాబాద్, వాంకిడి, జైనూర్, రెబ్బనమండలంలోని కొండపల్లి, నిర్మల్ జిల్లాలో నిర్మల్, ఖానాపూర్(కడెం), కుబీర్, భైంసా, సారంగాపూర్‌లలో సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు తయారు చేశారు. ఈ సారి పత్తి కొనుగోళ్లంతా సీసీఐ ఆధ్వర్యంలోనే జరగనున్నాయి. జిల్లాలో 18 మార్కెట్‌యార్డుల పరిధిలో కొనుగోలు కేంద్రాలు ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. ఆదిలాబాద్‌లో అత్యధికంగా పది, నిర్మల్, మంచిర్యాల జిల్లాలో అయిదు చొప్పున, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో నాలుగు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. జిన్నింగ్ సమస్య ఉన్న ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు సీసీఐ వెనుకంజ వేస్తుంది. కొనుగోలు చేసిన చోట జిన్నింగ్ ఉంటే అక్కడికక్కడే జిన్నింగ్ చేసి బేళ్లను తరలించే వీలుంది. జిన్నింగ్ మిల్లులు లేని చోట్లు కేంద్రం ఏర్పాటు చేస్తే అక్కడి నుంచి పత్తి తరలించడం సమస్యగా మారే వీలుండటంతో ఆ సదుపాయం ఉన్న ప్రాంతాల్లో కేంద్రాలు ఏర్పాటుకు సీసీఐ మొగ్గుచూపింది. అమ్మకాలు ప్రారంభం నుంచే సీసీఐ రంగంలో ఉంటే రైతులకు సరైన ధర లభిస్తుంది. అయితే తేమ పేరిట రైతుల పత్తిని కేంద్రానికి తీసుకెళ్లిన తర్వాత నిరాకరిస్తుండటం, అంక్షలు విధించడం తదితర కారణాలతో సీసీఐ కొనుగోళ్ళపై రైతులకు భరోసా లేకుండా పోయింది.

# విజయభాను సంపాదకీయం

## ప్రకృతి ప్రకోపం

ప్రకృతితో పరిహాసమాడితే ఫలితం ఎట్లా ఉంటుందో అమెరికా మొదలుకొని ఆసియా వరకు అనుభవానికి వస్తున్నది. వాతావరణ మార్పు వల్ల ప్రకృతి వైపరీత్యాలు తీవ్రతరమవుతాయని, దీర్ఘకాలికంగా మానవాళి మనుగడకే ముప్పు వాటిల్లుతుందని తెలిసినా విధానకర్తలు పట్టించుకోని ఫలితం ఇప్పుడు అనుభవించవలసి వస్తున్నది. అమెరికాలోని టెక్సాస్, లూసియానాలలో హార్వీ బీభత్సం చూసిన తరువాతనైనా వాతావరణ మార్పు ప్రభావం ఎంత తీవ్రంగా ఉంటుందో గ్రహించాలె. హార్వీ ఉగ్రరూపంలో విరుచుకపడటంతో భారీగా ప్రాణనష్టం వాటిల్లడమే కాకుండా అనేకమంది కడగండ్ల పాలయ్యారు. పారిశ్రామికరంగానికి జరిగిన నష్టం కూడా భారీగానే ఉన్నది. ఇక్కడ దక్షిణాసియాలోని భారత్, నేపాల్, బంగ్లాదేశ్‌లలో ఈ వానాకాలంలోనే వరదల వల్ల ఇప్పటి వరకు మరణించిన వారి సంఖ్య దాదాపు పన్నెండు వందలు. నాలుగు కోట్ల మంది నిరాశ్రయులయ్యారు. ఒక్క బీహార్‌లోనే ఐదువందల మందికి పైగా మరణించారు. లక్షలాదిమంది వరదలలో విలవిల్లాడారు. తాజాగా ముంబై నగరాన్ని వానలు అతలాకుతలం చేస్తున్నాయి. ముంబై నగరాన్ని వాన ఆగస్టు 29న ముంచెత్తడానికి కొద్ది రోజుల ముందు 21వ తేదీన చండీగఢ్‌లో వర్షం తన భీకర రూపాన్ని ప్రదర్శించింది. వానాకాలపు ఒక్క రోజు సగటు వర్షపాతానికి 23 రెట్లుగా 112 మిల్లీ మీటర్ల వాన కురిసింది. ఇంకా ముందు ఆగస్టు పదిహేనున బెంగళూరు నగరం వాన దెబ్బకు భీతిల్లిపోయింది. సగటు వర్షపాతానికి 37 రెట్లు ఎక్కువ కురువడంతో నగరం జలమయమైంది. ఆగస్టు 11, 12 తేదీలలో త్రిపుర రాజధాని అగర్తలా వానదెబ్బకు తల్లడిల్లిపోయింది. ఇంకా ముందు, జూలై 26-27 తేదీలలో అహ్మదాబాద్ 200 మిల్లీమీటర్ల వాన కురిసింది. వానలు కురువడం కొత్తకాదు. కానీ వానలు, తుఫానులు, ఎండలు, చలి, పెనుదుమారాలు ఉగ్రరూపంలో దాడి చేస్తున్నాయి. వాతావరణ మార్పు వల్లనే ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి వైపరీత్యాలు ఉగ్రరూపంలో విరుచుకుపడుతున్నాయని శాస్త్రవేత్తలు చెబుతూనే ఉన్నారు. కానీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మహాశయుడికి మాత్రం ఇదంతా గాలి కబుర్ల మాదిరిగానే కనిపిస్తున్నది. వాతావరణ మార్పు అంటూ భయపడి వ్యాపారాలను దెబ్బతీసుకోవడమేమిటనేది ఆయన ప్రశ్న. వాతావరణ మార్పును అరికట్టే షరతులు నష్టదాయకమంటూ ప్యారిస్ ఒడంబడిక నుంచి అమెరికాను బయటకు తీసుకువచ్చారు. ఆవు చేను లో మేస్తే దూడ గట్టున మేస్తుందా అన్నట్టు ట్రంప్ ను ఆవరించుకుని ఉన్న మేధోపరివారం కూడా హార్వీ తుఫానుకు వాతావరణ మార్పునకు సంబం ధం ఏమిటని అంటున్నారు. భారీ ఉష్ణోగ్రతలు నమోదు కావడం, తత్ఫలితంగా భీకర తుఫానులు రావడం కండ్ల ముందే కనిపిస్తున్నా రెండింటికీ సంబంధం లేదని చెబుతున్నారు. ఒక్క హార్వీ తుఫాను మాత్రమే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రత పెరుగుదల, వైపరీత్యాల ఉగ్రత గమనిస్తే మానవాళి మనుగడకు ప్రమాదం తలెత్తుతున్నదనేది బోధపడుతుంది. కానీ ట్రంప్ అనుచరులు మాత్రం కాలుష్యాలను అరికట్టే శుద్ధ సాంకేతిక విధానాల కోసం భారీ ఖర్చు చేసే బదులు వరదల ను తట్టుకోవడానికి చేసే వ్యయం లాభసాటి అని వితండవాదనకు దిగుతున్నారు. అయితే ట్రంప్ వాదనలకు భిన్నంగా వాతావరణ మార్పును అరికట్టాలనే విషయమై అమెరికాలో దృఢాభిప్రాయం వ్యక్తమవుతున్నది. పలు రాష్ట్రాలు ప్యారిస్ ఒప్పందానికి అనుగుణంగా పర్యావరణ హిత విధానాలను అమలు చేయాలని భావిస్తున్నాయి. ఒబామా హయాంలో మౌలిక వసతులను వాతావరణ మార్పులకు అనుగుణంగా నిర్మించుకోవాలని నిబంధనలు రూపొందించారు. కానీ ట్రంప్ దీనిని తేలిగ్గా కొట్టిపారేసి ఈ నిబంధనలను మారుస్తామని ప్రకటించారు. దీనికి మెక్సికో జలసంధి ప్రాంతాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. అమెరికా సంగతి సరే, మన దేశంలోని నగరాలు వాన బీభత్సానికి తట్టుకునేలా ఉన్నాయా అనే చర్చ మొదలైంది. నగరాలలో జన సాంద్రత చాలా ఎక్కువగా ఉంటుంది. అందువల్ల వరదల ప్రభావం వల్ల జరిగే ప్రాణ, ఆస్తి నష్టం చాలా ఎక్కువ. పారిశ్రామిక రంగంపై కూడా ప్రభా వం చూపుతుంది. కానీ మన నగరాలు సాధారణ వర్షపాతానికే జలమయం అవుతున్నాయి. ఏ మాత్రం ముందు చూపు లేకుండా, నగరాలు విస్తరించే కొద్దీ నదులు, పాయలు, కాలువలపైనే నిర్మాణాలు చేపట్టారు. చెన్నైలో అడయార్ నది ప్రవాహంపైనే విమానాశ్రయ రన్‌వే నిర్మించడం ఆశ్చర్యకరం. ఇష్టారీతిన నిర్మాణాలు చేపట్టడం వల్లనే నీరు పోయే దారి లేక 2015లో చెన్నై నగరమంతా నీట మునిగిపోయింది. మిగతా నగరాలదీ ఇదే పరిస్థితి. వందల ఏండ్ల కింద ట నిర్మించిన పాత నగరాలు నీట మునుగడం లేదు. కానీ నగరాలు విస్తరించిన ప్రాంతాలే ఎక్కువగా జలయయం అవుతున్నాయి.

## రాజీనామాపై ఉమాభారతి నో కామెంట్స్



న్యూఢిల్లీ: రాజీనామా వార్తల నేపథ్యంలో కేంద్ర జలవనరుల శాఖా మంత్రి ఉమాభారతి స్పందించారు. ఆ అంశంపై తనకు ఎలాంటి సమాచారం లేదని, కామెంట్ కూడా చేయబోనని ఆమె చెప్పుకొచ్చారు. కేంద్ర మంత్రి వర్గ విస్తరణ నేపథ్యంలో పలువురు మంత్రులకు ఉద్వాసన తప్పదంటూ పేర్లతోసహా సంకేతాలు అందిన విషయం తెలిసిందే.

ఈ నేపథ్యంలో మీడియా ఆయా మంత్రులను సంప్రదిస్తూ వస్తోంది. రాజీవ్ ప్రతాప్ రూడీ గురువారమే రాజీనామా చేయగా, తన నిర్ణయం కాదని.. అధిష్టానం ఆదేశాలమేరకే తాను రాజీనామా చేసినట్లు ఆయన మీడియాకు వెల్లడించారు. ప్రభుత్వం ద్వారా ప్రజలకు సేవ చేసే అవకాశ దక్కిందని, ఇప్పుడు పార్టీకి సేవలు చేస్తానని రూడీ తెలిపారు.

మరో మంత్రి మహేంద్ర నాథ్ పాండేను యూపీ బీజేపీ అధ్యక్ష పదవి అప్పజెప్పగా, తదనంతరం ఆయన రాజీనామా చేశారు.

కేంద్ర మంత్రి పదవికి సంజీవ్ బల్యాన్ కూడా రాజీనామా చేసినట్లు సమాచారం. వీరంతా అధిష్టానం ఒత్తిడి మూలంగానే రాజీనామా చేస్తున్నారా? అన్న ప్రశ్నలు మొదలవుతున్నాయి. ఇక మంత్రి వర్గ విస్తరణలో కొత్తగా జేడీ(యూ) కు రెండు బెర్తులు దక్కే అవకాశం ఉంది.

## మళ్లీ అదే అవమానం!



దిల్లీ: గతంలో తనకి రైలు ప్రయాణంలో ఎలాంటి అవమానం జరిగిందో తాజాగా మళ్లీ అదే తరహాలో అవమానం జరిగిందని పారా అథ్లెట్ సువర్ణరాజ్ తెలిపారు. పోలియోతో బాధపడుతూ కదల్లేని స్థితిలో ఉన్న ఆమెకు రైల్వే సిబ్బంది అప్పర్ బెర్త్ కేటాయించారు. దీంతో ఆమె సుమారు 12గంటలకు పైగా చక్రాల కుర్చీకే పరిమితమయ్యారు.

దిల్లీ నుంచి నాగ్‌పూర్ వెళ్లేందుకు సువర్ణ తాజాగా రైలు టికెట్ బుక్ చేసుకున్నారు. చిన్నతనంలోనే పోలియో సోకడంతో 90శాతం అంగవైకల్యంతో ఆమె చక్రాల కుర్చీకే పరిమితమయ్యారు. అయితే రైల్లో ఆమెకు టీటీఈ అప్పర్ బెర్త్ ఇచ్చారు. తాను పైకి ఎక్కలేనని, సీటు మార్చాల్సిందిగా టీటీఈని కోరినా ఎలాంటి ప్రయోజనం లేదని నాగ్‌పూర్ చేరుకున్న ఆమె మీడియాకి తెలిపారు. జూన్‌లో ఎలాంటి అవమానాన్ని ఎదుర్కొన్నానో ఇప్పుడు కూడా అదే జరిగిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

జూన్‌లో గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌లో నాగ్‌పూర్ నుంచి దిల్లీ వెళ్లిన సమయంలో సువర్ణ రాజ్ సుమారు 12గంటలపైగా చక్రాల కుర్చీలోనే కూర్చుని ప్రయాణించింది. దీనిపై అప్పట్లో సువర్ణ కేంద్ర రైల్వేశాఖ మంత్రి సురేశ్ ప్రభుకు ట్విటర్ ద్వారా ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే.

## రాజీనామా నా నిర్ణయం కాదు



దిల్లీ: కేంద్ర మంత్రి మండలి పునర్వ్యవస్థీకరణకు సమయం దగ్గరపడుతోంది. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రులు రాజీవ్ ప్రతాప్‌రూడీ, ఉమాభారతి తమ పదవులకు రాజీనామా చేశారు. అయితే రాజీనామా చేసిన అనంతరం రూడీ తొలిసారిగా మీడియాతో మాట్లాడారు. రాజీనామా చేయడం అనేది తన నిర్ణయం కాదని.. అది పార్టీ నిర్ణయం అని రూడీ చెప్పడం గమనార్హం.

ఇది నా నిర్ణయం కాదు. పార్టీ ఈ నిర్ణయం తీసుకుంది. దాన్ని నేను ఫాలో అయ్యాను. నన్ను పదవి నుంచి ఎందుకు తప్పుకోమన్నారో తెలియదు. కానీ పార్టీ ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరించడం నాకు సంతోషంగా ఉంది అని రూడీ తెలిపారు. అయితే కేంద్రమంత్రిగా వైదొలిగిన తర్వాత పార్టీ పరంగా మీకు కీలక బాధ్యతలు అప్పగిస్తారని ప్రచారం జరుగుతోంది. దీన్ని మీరు నమ్ముతున్నారా? అని మీడియా ప్రశ్నించగా.. రూడీ చూద్దాం అన్నట్లు సమాధానమిచ్చారు.

కేంద్ర కేబినెట్‌లో మార్పులు చేర్పులు చేసేందుకు ఎన్డీయే ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. కేబినెట్‌లోకి కొత్త మంత్రులను తీసుకొచ్చే ప్రయత్నంలో ఉంది. మరోవైపు మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో రాజీవ్ ప్రతాప్ రూడీ సహా ఉమాభారతి, సంజీవ్ బల్యాన్ రాజీనామా చేశారు. మరి కొందరు కేంద్ర మంత్రులు కల్‌రాజ్ మిశ్రా, ఫగ్గన్‌సింగ్ కులస్థే, మహేంద్ర పాండే కూడా రాజీనామాలకు సిద్ధపడ్డారు. ఇక కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి రాధామోహన్‌సింగ్‌ను కూడా పదవి నుంచి తప్పించనున్నట్లు తెలుస్తోంది. శనివారం ఈ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ జరిగే అవకాశముంది.

## అశ్విన్ విజృంభణ

లండన్: కౌంటీ క్రికెట్ బరిలోకి దిగిన భారత టాప్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఆడిన మొదటి మ్యాచ్‌లోనే విజృంభించి జట్టుకు ఘన విజయాన్ని అందించారు. వార్సెస్టర్‌షైర్ తరపున ఆడుతున్న అశ్విన్... గ్లూసెస్టర్‌షైర్‌తో జరిగిన మ్యాచ్ లో మొత్తం ఎనిమిది వికెట్లతో సత్తా చాటారు. తొలి ఇన్నింగ్స్ లో మూడు వికెట్లతో శుభారంభం అందించిన అశ్విన్.. రెండో ఇన్నింగ్స్ లో ఐదు వికెట్లతో మెరిశాడు. దాంతో ఆడుతున్న తొలి మ్యాచ్ లోనే ఒక ఇన్నింగ్స్ లో ఐదు వికెట్లను సాధించిన అరుదైన ఘనతను అశ్విన్ సొంతం చేసుకున్నారు.

గ్లూసెస్టర్‌షైర్ కు 400 విజయలక్ష్యాన్ని నిర్దేశించిన క్రమంలో వార్సెస్టర్‌షైర్ కెప్టెన్ జో లీచ్ తో పాటు అశ్విన్ చెలరేగిపోయారు. వీరిద్దరూ కలిసి ప్రత్యర్థి టాపార్డర్ వికెట్లను పేకమేడలా కూల్చడంతో వార్సెస్టర్‌షైర్ 189 పరుగుల తేడాతో విజయం సాధించింది. అశ్విన్ దెబ్బకు . గ్లూసెస్టర్‌షైర్ 211 పరుగులకే చాపచుట్టేసి ఓటమి పాలైంది.

రెండో ఇన్నింగ్స్ ఆరంభంలోనే గ్లూసెస్టర్‌షైర్ రెండు వికెట్లను వరుసగా తీసిన అశ్విన్.. ఓవరాల్ గా ఐదు వికెట్లను సాధించారు.. అశ్విన్ రెండో ఇన్నింగ్స్ లో 34 ఓవర్లపాటు బౌలింగ్ వేసి ఎనిమిది మెయిడిన్లు వేసి 68 పరుగులిచ్చాడు.

## సమయం

### జన్మ సాఫల్యం

అన్ని జన్మలలో కంటే ఉత్కృష్టమైన,  
అతి దుర్లభమైన మానవ జన్మను పొంది  
నమో విశ్వరూపాయ నమ: అను రీతిన  
ఆ పరమాత్మను గుర్తెరిగి  
ఉపాసించలేని జీవితం వ్యర్థం  
నామ, రూప, గుణ రహితమైన  
ఆ పరబ్రహ్మమును దర్శించడమే  
మన జీవిత లక్ష్యం, గమ్యం పరమావధి కావాలి  
హృదయమును వివేకపూరితంగా,  
ఆత్మను మలిన రహితంగా చేసుకొని  
కఠినమైన తపస్సుతో, సాధనతో  
అరిషడ్వర్గములను లోబర్చుకొని,  
దుష్ట సంస్కారములను రూపు మాపుకొని  
పరమాత్మను దర్శించి  
జన్మ సాఫల్యం పొందడమే మన కర్తవ్యం

సి.ప్రతాప్

## పంచాంగం

మాసం : భాద్రపద ; తిథి : ఏకాదశి ఉ. 8.16  
పూర్వాషాడ ఉ. 7.22 వ.సా. 4.06ల 5.50

శనివారం  
02-09-2017

**మేషం** : చేపట్టిన పనులలో నెమ్మదిగా మార్పులు సంభవిస్తాయి. రియల్ ఎస్టేట్ రంగాల వారికి కలసివచ్చే కాలం. ముఖ్యుల రాకపోకలు, అనుకోని ఖర్చుల వల్ల స్వల్ప ఇబ్బందులు తప్పవు. వస్త్ర, బంగారు, వెండి, లోహ వ్యాపారులకు మిశ్రమ ఫలితం. **వృషభం** : ఖర్చులు అధికమైనా ఆర్థిక ఇబ్బందులు అంతగా ఉండవు. కాంట్రాక్టర్లకు రావలసిన ధనం కొంత ముందు వెనుకలుగానైనా అందుతుంది. ఆడిటర్లకు నూతన ఆలోచనలు స్ఫురిస్తాయి. గృహంలో సందడి కానవస్తుంది. వస్త్ర వ్యాపారస్తులకు చికాకు తప్పదు. ఆకస్మిక ప్రయాణాలు. **మిథునం:** విద్యార్థినులకు టెక్నికల్, కామర్స్, కంప్యూటర్ విద్యలపట్ల ఆసక్తి పెరుగుతుంది. నిర్మాణ పనులలో సంతృప్తి, పురోభివృద్ధి కానవస్తుంది. నూతన పరిచయాలు, సంబంధ బాంధవ్యాలు మెరుగుపడతాయి. నూనె, పసుపు, చింతపండు స్టాకిస్టులకు, రీటైల్ వ్యాపారులకు లాభదాయకం. పండ్ల, పూల, కూరగాయల వ్యాపారులకు లాభదాయకం. **కర్కాటకం** :కుటుంబీకుల మధ్య సంబంధ బాంధవ్యాలు మెరుగవుతాయి. వ్యవసాయ, తోటల రంగాల వారికి నిరాశాజనకం. నిరుద్యోగులకు రాత, మౌఖిక పరీక్షలలో ఏకాగ్రత అవసరం. కాంట్రాక్టర్లకు రావలసిన ధనం కొంత ముందు వెనుకలుగానైనా అందుతుంది. ముఖ్యుల నుండి ఒక సమాచారం అందుకుంటారు. కొత్త సంస్థలు ప్రారంభిస్తారు. **సింహం** :ఆర్థిక విషయాల్లో చురుకుదనం, చేపట్టిన పనులలో విజయం చేకూరుతుంది. కొంతమంది మీపై అభాండాలు వేసే ఆస్కారం ఉంది, జాగ్రత్త వహించండి. ఉద్యోగులకు తోటివారి సహకారం వల్ల గుర్తింపు, రాణింపు లభిస్తాయి. స్త్రీలకు కళ్ళు, తల, నరాలు, నడుముకు సంబంధించిన చికాకులు అధికం అవుతాయి. పెట్టుబడులలో నిదానం అవసరం. **కన్య** :ట్రాన్స్‌ఫోర్టు, ఎక్స్‌ఫోర్టు, ఆటోమొబైల్, మెకానికల్ రంగాల వారికి పనివారితో చికాకులు తప్పవు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం మంచిది. బ్యాంకింగ్ రంగాల వారికి పనిలో ఒత్తిడి చికాకులు తప్పవు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అవకాశాలు దగ్గరకు వస్తాయి. విలువైన వస్తువులను సేకరిస్తారు. రుణబాధలు తొలగిపోతాయి. **తుల** : స్త్రీలు వస్త్రాలు, విలువైన వస్తువులు అమర్చుకుంటారు. సొంత నిర్ణయాలు తీసుకోవడం వల్ల మీకెంతో శుభం చేకూరు తుంది. గమనించండి. పత్రిక, ప్రైవేటు సంస్థల్లోనివారు ఓర్పు, అంకితభావంతో పనిచేసి యాజమాన్యం నుండి గుర్తింపు, ప్రశంసలు పొందుతారు. క్రయ, విక్రయ రంగాల్లోని వారికి సామాన్యం. గత అనుభవాలు జ్ఞప్తికి వస్తాయి. **వృశ్చికం** : విద్యార్థినులు కొత్త విషయాలపట్ల ఏకాగ్రత, ఉత్సాహం కనబరుస్తారు. మీ సమర్థతకు, మీ తెలివితేటలకు మంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. ఖర్చులు పెరిగినా ఆర్థిక ఇబ్బందులు అంతగా ఉండవు. వస్త్ర, బంగారం, వెండి, వ్యాపారులకు, పనివారలకు పురోభివృద్ధి. **ధనుస్సు** :ఉమ్మడి వ్యాపారాలు, వాణిజ్య ఒప్పందాలు ఒక కొలిక్కి వస్తాయి. కోర్టు వ్యవహారాలు, మీ పాత సమస్యలు ఒక కొలిక్కి రాగలవు. వాహనం నడుపుతున్నప్పుడు మెలకువ వహించండి. మీ ప్రత్యర్థుల తీరును గమనించి ముందుకు సాగటం మంచిది. ఉద్యోగస్తులకు బరువు బాధ్యతలు అధికం అవుతాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. **మకరం** : మీలోని బలహీనతలను తొలగించుకోవటంపై దృష్టి పెడతారు. ఆర్థిక విషయాలలో పురోభివృద్ధి. బ్యాంకు రుణాలు అందుతాయి. మానసిక ప్రశాంతత లభిస్తుంది. కొన్ని సందర్భాలలో రిస్క్ తీసుకోవాల్సి వచ్చినా చివరికి మంచే జరుగుతుంది. చివరికి విజయం మీ సొంతం. **కుంభం** : ఆర్థిక లావాదేవీలు ఆశాజనకం. వస్తు, వస్త్ర లాభాలు. స్థిరాస్తి వివాదాలు తీరతాయి. పారిశ్రామిక రంగం వారికి అధికారుల నుంచి వేధింపులు, కార్మిక సమస్యలు అధికం అవుతాయి. నిరుద్యోగుల యత్నాలు కలసి రాగలవు. విలువైన వస్తువులు కొంటారు. **మీనం** : ఆభరణాలు కొంటారు. శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. నిరుద్యోగులకు ఏ చిన్న అవకాశం లభించినా సద్వినియోగం చేసుకోగలరు. ప్రైవేటు సంస్థల్లోని వారికి యాజమాన్యంతో ఏకీభావం కుదరదు. స్పెక్యులేషన్ నిరాశపరుస్తుంది. సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొంటారు.

## స్థల పురాణం



అర్జునునితో మల్లయుద్ధము చేసిన ఈశ్వరుడు కావున మల్ల ఈశ్వరుడు మల్లేశ్వరుడైనాడని, మల్లికాసుమాలచే పూజించ బడటం వలన మల్లిఈశ్వరుడు మల్లీశ్వరుడైనాడని ఒక ఐతిహ్యం. మహిషా సురమర్దినిగా ఇందకీలాద్రిపై నున్న కనకదుర్గ అష్ట బాహువులతో వివిధ ఆయుధ ధారిణియై మనకు దర్శనమిస్తోంది. దీనికి ఆధారంగా దేవీభాగవతంలో ఒక కథ కన్పిస్తోంది. శుంభ నిశుంభులను రాక్షసులు శివుని మెప్పించి పురుషుని వలన మరణం లేకుండా వరం పొందుతారు. ఆ వర గర్వంతో దేవత లను యజ్ఞ హవిస్సులను సైతం హరించసాగారు. దేవతలు వెళ్లి శివునితో మొరపెట్టుకున్నారు . శివుని అర్థబాగమైన గౌరి తన శరీరమునుండి ఒక స్త్రీమూర్తిని అవతరింపజేసింది ఆమె పేరు కౌశిక. ఆమె సౌందర్యా నికి మోహితులై తమను పెళ్లి చేసు కోవలసిందిగా కౌశిక వద్దకు రాయబారం పంపించారు శుంభ నిశు ంభులు. యుద్ధంలో తనను ఓడించిన వారినే వివాహం చేసుకుంటానన్నది కౌశిక. ఆ యుద్ధంలో రాక్షస సేనానాయకులైన ధూమ్రలోచనుడు, చండముండులను సంహ రించి, ఉగ్రరూపిణియై ప్రచండదుర్గగా శుంభనిశుం భులను సైతం మట్టుపెట్టింది తల్లి.

ఇంద్రకీలాద్రిపై వెలసిన ఆ ఉగ్రరూపిణిని దర్శించడానికి దేవతలు కూడ భయపడుతుంటే ఆదిశంకరులు శ్రీ చక్ర స్థాపన చేసి ఆమెలోని రౌద్రకళలనన్నింటిని వేరొకమూర్తిలోకి ఆవాహన చేసి శాంత మూర్తిగా మార్చి మల్లేశ్వరునితో శాంతి కళ్యాణం జరిపించారని ఆనాటి నుండి ఆమె కనకదుర్గయై భక్తులను కాపాడుతోందని స్థల పురాణం చెబుతోంది.

**ఆలయ ప్రత్యేకత** : ఇంద్ర కీలాద్రిపై వెలసిన కనకదుర్గ స్వయంభువు. ఈమె అష్టభుజాలు కలిగి,శంఖ చక్ర గదా ఖడ్గ పాశ భిండి వార త్రిశూలాది ఆయుధాలను ధరించి అభయహస్తంతో మహిషాసుర మర్థనిగా మనకు దర్శనమిస్తోంది. ఈవిడ మహిషాసుమర్థని అయితే దుర్గమ్మ ఎక్కడ అని వెతుకులాడే భక్తకోటికి మన పూర్వీకులు ఒక నమ్మకాన్ని ప్రచారం చేశారు. ఇంద్రకీలాద్రి పైనే గుహల్లో ఎక్కడో కనకదుర్గాదేవి మూర్తి ఉందని, ఆమెను నిత్యం యోగులు ఋషులు యక్షులు కిన్నెరులు దేవతలు సేవించుకుంటూ ఉంటారని మహిషా సురమర్థని ప్రథమ ద్వారం కాగా రెండవద్వారం వద్ద చింతా మణి దుర్గాదేవి దర్శనం లభిస్తుందని చెబుతున్నారు.

ఈ విధమైన వాదనే వేదాద్రి యోగానందనరసింహస్వామి విషయం లోను విన్పిస్తోంది. స్వామివారు గుహలో ఉన్నారని నేను వెళ్లి వచ్చా మని వయోవృద్ధులై మరణించబోతూ నాతో చెప్పిన వాళ్లున్నారు. మరికొన్ని ప్రముఖ దేవాలయాల్లో కూడ ఇటువంటి వాదనలు విన్నాము. వీటిని స్థూలంగా విశ్లేషిస్తే మంత్రద్రష్టలు ఉపాసనాపరులైన మనపూర్వీకులు అనేక వేరువేరు కారణాల వలన మూలమూర్తులను మరుగుపరచి ప్రతిష్ఠామూర్తులలో మూలరూపశక్తులను ఆవాహన చేసి మనకందించారేమో ననిపిస్తోంది. ఇది విషయాంతరము... చర్చనీయార్హము. సింహ వాహనారూఢయైన మహిషాసురమర్థనిగా కనకదుర్గమ్మ కొలువు తీరివుంది. ఆమెకు ఎడమ వైపు శ్రీచక్రం ప్రతిష్టించబడింది. ధుర్గామల్లేశ్వర స్వామి వార్లకు జరిగే పూజలన్నీ ఈ శ్రీచక్రానికే జరుగుతాయి. ప్రక్కనే గణపతి విగ్రహం దర్శనమిస్తుంది. విజయవాడ శక్తి ప్రధానక్షేత్రమైప్పటికి ఇచ్చట శాక్తేయ విధానంలో ఆరాధన జరగటం లేదు. ఇది ఇక్కడి ప్రత్యేకత. మహిషాసురుడనే రాక్షసుని సంహరించిన ఆదిశక్తి మహిషాసుర మర్థనియైెంది.ఆ కథ ఇలా ఉంది. దితి రాక్షసుల తల్లి. తనసంతా నాన్నిఇంద్రుడు మట్టుపెడుతుండటంతో ఇంద్రుని చంపగలిగిన కుమారుని కోసం సుపార్శ్వుడనే ముని ఆశ్రమం ప్రక్కగా దితి ఘోరతపస్సు

## సంకీర్తన



ప్రారంభించింది. ఆమె తపస్సువేడికి కోపగించిన సుపార్శ్వుడు నీకు మహి షుడు పుడతాడని శపించాడు. ఆమెకు ప్రత్యక్ష మైన బ్రహ్మ సైతం ముఖము మహిషమై మిగిలిన శరీరం నరరూ పంతుండే కుమారుణ్ణి ప్రసాదించాడు. మహి షుడు తపస్సు చేసి శివుని మెప్పించి మరణం లేకుండా వరాన్ని కోరాడు. పుట్టిన వానికి మరణం తప్పదు అన్నాడు శివుడు. అయితే మగ వానితో మరణం లేనట్లు వరం పొందాడు మహిషుడు. మహిషుని ఆగ డాలను భరించలేని దేవతా గణం తమ నారీ తేజాల నన్నింటిని ఒక్క చోట చేర్చి ప్రార్థించారు.

ఆ తేజస్సు నుండి ప్రచండ శక్తి ఆవిర్భవించి మహిషాసురుని మట్టుపెట్టి మహిషా సురమర్ధ నియై పూజలందు కుంటోంది. ఇది ఒక స్థలపురాణం.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

# అన్నదాతను బలిగొన్న అప్పులు

నిజాంబాద్ : పంట రుణాలు అన్నదాత ఉసురు తీశాయి. వరుసగా వర్షాల్లేక పంట దిగుబడి రాకపోవడంతో అప్పులు భారంగా మారాయి. దీనికి తోడు ఇద్దరు ఆడపిల్లల పెళ్లిళ్లకు చేసిన అప్పులు కూడా తోడు కావడంతో వాటిని తీర్చే మార్గం లేక రైతు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడిన దుర్ఘటన వంగూరు మండలంలో చోటుచేసుకొంది. ఎస్సై వీరస్వామి, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వంగూరు మండలం నిజాంబాద్ గ్రామానికి చెందిన రైతు వేణుగోపాల్ (48)కు మూడు ఎకరాల పొలం ఉంది. దానికి తోడుగా మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని ఆరు ఎకరాల్లో పత్తిపంట వేశారు. మూడేళ్లు వరుసగా వర్షాల్లేక పంటలు దెబ్బతిని ఆర్థికంగా చితికి పోయిన వేణుగోపాల్ ఈసారైనా గట్టెక్కక పోతానా అనుకొని.. ఆసామి దగ్గర మరికొంత అప్పు చేశారు. మొత్తం అప్పు రూ.5 లక్షలకు చేరింది. పంట ఎదిగి పూవ్వు వచ్చేదశలో ఈ ఏడాది కూడా వర్షాల్లేక పంట ఎండిపోవడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. దీనికి తోడు ఎనిమిది నెలల కిందట రూ.6 లక్షలు అప్పు చేసి, ఇద్దరు కుమార్తెలకు వివాహం చేశారు. ఒకపక్క కుమార్తెల వివాహానికి చేసిన అప్పు, మరోపక్క పత్తిపంట సాగుకు చేసిన అప్పు భారంగా మారింది. పత్తిపంట కూడా ఎండిపోతుండటంతో అప్పులు తీర్చే మార్గం కనిపించక పొలానికి వెళ్లి పురుగు మందు తాగారు. పొలంలోనే పని చేస్తున్న కూలీలు, కుటుంబ సభ్యులు గమనించి 108 వాహనంలో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందారు. రైతు భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

అప్పుల భారంతో రైతు వేణుగోపాల్ ఆత్మహత్యకు పాల్పడ్డారని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ కోరారు. కల్వకుర్తి ఆసుపత్రికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వేణుగోపాల్ కాంగ్రెస్ పార్టీలో చురుకైన కార్యకర్తగా పనిచేశారని గుర్తు చేశారు. కుటుంబానికి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. రైతు భార్య లక్ష్మమ్మను పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట ఎంపీటీసీ సభ్యుడు సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లయ్య, యాదగిరిరావు, వెంకట్‌రెడ్డి, లక్ష్మయ్య, గెల్వయ్య ఉన్నారు.

# విద్యార్థి సమస్యల పరిష్కారంలో విఫలం

## ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రమేశ్



వనపర్తి : రాష్ట్ర ప్రభుత్వం కొలువుదీరి మూడేళ్లు పూర్తయినా విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి రమేశ్ విమర్శించారు. పట్టణంలోని ఎస్ఎఫ్ఐ కార్యాల యంలో జరిగిన సమాఖ్య జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యను ప్రైవేటీకరించాలని చూస్తోందని, కొత్తగా ఏర్పాటు చేసిన గురుకులాలకు సొంత భవనాలను నిర్మించకుండా అద్దె వాటిల్లో కొనసాగిస్తూ విద్యార్థులను అనేక సమస్యలకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మూడేళ్లుగా ఫీజు రీయంబర్స్‌మెంటు రూ.1800 కోట్లు పెండింగులో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కళాశాలల్లో ఆగస్టు ఒకటి నుంచి భోజన వసతి కల్పిస్తామని నేటికీ నెరవేర్చకపోవడం దారుణమన్నారు.

ఉద్యమాల ద్వారా సాధించుకున్న తెలంగాణలో హక్కుల కోసం పనిచేస్తున్న విద్యార్థులపై నిర్బంధాలు తగదని, తక్షణమే పోలీసు చట్టం- 30ని ఉపసంహరించు కోవాలన్నారు. లేదంటే విద్యార్థి ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సమాఖ్య జిల్లా కార్యదర్శులు అరుణ్‌చేతన్, మహేశ్, ఉపాధ్యక్షుడు ఆది, సహాయకార్యదర్శులు కల్యాణ్, నాయకులు మొగిలి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# సీపీఎస్ రద్దుకు డిమాండ్



మెదక్ : కాంట్రిబ్యూటరీ పింఛన్ విధానాన్ని రద్దు చేసి పాతపింఛన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఆందోళనకు దిగనున్నాయి. ఈ మేరకు తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల సంఘం, టీఎన్జీవో, జాక్టో, ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ, పీఆర్టీయూ ఆధ్వర్యంలో మెదక్‌లో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సీపీఎస్ ఉద్యోగులసంఘం కలెక్టరేట్ వద్ద ధర్నా, ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్థానిక చిల్డ్రన్స్‌పార్క్ నుంచి కలెక్టరేట్ వరకు భారీర్యాలీతో పాటు కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టేందుకు సమాయత్తం అవుతున్నారు. టీఎన్జీవో ఆధ్వర్యంలో మధ్యాహ్నభోజన విరామ సమయంలో కలెక్టరేట్‌లో నల్లబ్యాడ్జీ లతో నిరసన తెలపనున్నారు. పీఆర్టీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ చేపడుతున్న ఈ ఆందోళనల జయప్రదం కోసం సామూహిక సెలవులు పెట్టి హాజరుకావాలని ఆయాసంఘాల బాధ్యులు పేర్కొన్నారు. కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయ ప్రదం చేయాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మురళి, చరణ్ సింగ్, జిల్లా కార్యవర్గసభ్యులు మహేందర్, ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, ప్రణీద్‌కుమార్ కోరారు.

# వీఆర్వోల సమస్యల పరిష్కారానికి కృషి: తుమ్మల

ఖమ్మం : ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసే వీఆర్వోల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ర.భ.శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారని తెలంగాణ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేందర్‌రావు తెలిపారు. మంత్రి తుమ్మలను ఖమ్మంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో వీఆర్వోలు కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సాదాబైనామా విజయవంతంలో వీఆర్వోలది కీలకపాత్ర అన్నారు. రైతులకు ప్రభుత్వం అందించే రూ.4వేల ప్రోత్సాహకంలో అందరు రైతులకు న్యాయం జరిగేలా చూడాలని వీఆర్వోలకు సూచించారు. నెల రోజులలో సమావేశం ఏర్పాటు చేసి వీఆర్వోల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేందర్‌రావు, నాయకులు సున్నం రామారావు, షేక్ నాగులుమీరా, ధరావత్ భాస్కర్, భూక్యా శ్రీను, బి.ఎం నరసింహారావు, చీమల నాగేంద్ర బాబు, రాజరత్నం, బంకా కృష్ణ, భాస్కర్, చిన్న వీరభద్రం, జానీ, ఉపేందర్, పాపారావు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రంబెల్లి, ముల్కలచెరువు ఆదర్శం కావాలి

## జిల్లా పాలనాధికారుల సమీక్షలో ముఖ్యమంత్రి



భువనగిరి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ దస్త్రాల ప్రక్షాళన కార్యక్రమాన్ని పక్కాగా చేపట్టేందుకు యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం ఎర్రంబెల్లి, నల్గొండ జిల్లా మిర్యాలగూడ డివిజన్‌లోని ముల్కలచెరువు గ్రామాలను ఆదర్శంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రస్థాయి జిల్లా పాలనాధికారుల సమావేశంలో సూచించారు. హైదరాబాద్ ప్రగతి భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల పాలనాధికారులు గౌరవ్ ఉప్పల్, సురేంద్రమోహన్, అనితారామచంద్రన్, జేసీలు, ఆర్డీవోలు హాజరయ్యారు. భూదస్త్రాల ప్రక్షాళన దిశా నిర్దేశానికి ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసంగం అనంతరం ఈ జిల్లాల్లో తొలుత ప్రయోగాత్మకంగా చేపట్టిన దస్త్రాల నవీకరణ కార్యక్రమంపై భువనగిరి ఆర్డీవో ఎంవీ భూపాల్‌రెడ్డి, మిర్యాలగూడ ఆర్డీవో కిషన్‌రావు తమ అనుభవాలను పంచుకున్నారు. దస్త్రాల నవీకరణ చేపట్టిన ఎర్రంబెల్లి, ముల్కలచెరువు గ్రామాల్లో రీసర్వే నిర్వహించిన విధానాన్ని వారు వివరించారు. శత శాతం దస్త్రాలను నవీకరించి వివాదరహిత గ్రామాలుగా ప్రకటించేందుకు ఆర్డీవోలకు కితాబు ఇవ్వడంతోపాటు సిబ్బందిని అభినందించారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో దస్త్రాల నవీకరణ కార్యక్రమం కొనసాగుతున్న విషయం విదితమే. రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో వారు అనుసరించిన విధానం స్ఫూర్తి కావాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వచ్చే మూడు నెలలు భూరికార్డుల ప్రక్షాళనకు జిల్లాల పాలనాధికారులు, జేసీలు, ఆర్డీవోలు తహసీల్దార్లు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రెండు విభాగాలుగా విభజించి తొలుత ఏ విభాగంలో ప్రభుత్వ, అటవీ, బంజరు, వివాదాలులేని భూముల సర్వేచేసి దస్త్రాలను నవీకరణ చేయాలని, పార్ట్ బిలో వివాదాలు, తగాదాలు ఉన్నవాటిని చేపట్టాలని ఆదేశించారు. దస్త్రాల ప్రక్షాళనకు రూ.50 లక్షలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని తొమ్మిది గ్రామాలకు ఒక బృందాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు.

సమావేశంలో జిల్లాల్లోని పలు సమస్యలు, చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను జిల్లా పాలనాధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో జిల్లా కేంద్ర ఆసుపత్రి అభివృద్ధికి నిధుల కేటాయింపు, గర్భిణీ స్త్రీలకు రక్తహీనత తదితర సమస్యలను పాలనాధికారి అనితారామచంద్రన్ ముఖ్యమంత్రి దృష్టికి తేగా ఆస్పత్రి అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. రక్తహీనత సమస్యను పరిష్కరించేందుకు వైద్యపర చర్యలపై మహిళా కలెక్టర్లు చర్చించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

జిల్లాలో అమలు జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఆమె వివరించారు. సూర్యాపేట కలెక్టర్ సురేంద్రమోహన్ తమ జిల్లాలోని ఎండ్లపల్లిలో నాయిబ్రాహ్మణుల సంక్షేమానికి ఏర్పాటు చేసిన అధునాతన క్షౌరశాల గురించి వివరించారు. ఉమ్మడి జిల్లాలో చేపట్టిన కాళేశ్వరం తదితర సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ముఖ్యమంత్రి సూచించారు. జిల్లా కలెక్టర్లు తమ పరిధిలోని తండ, ఎస్సీ కాలనీలో అన్ని వసతులు సమకూర్చేందుకు రూ.కోటి చొప్పున కేటాయిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర, గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఆయన తెలిపారు. సమావేశంలో జేసీలు రవి గుగ్లోతు, నారాయణరెడ్డి, సంజీవరెడ్డి, ఆర్డీవోలు పాల్గొన్నారు.

# వినాయకుడికి 108 వంటకాలతో నైవేద్యం

గోపాలపూర్ : గణపతి నవరాత్రి వేడుకల్లో భాగంగా హన్మకొండలో 46 డివిజన్ పరిధిలోని సాయిగణేశ్‌కాలనీలో విఘ్నేశ్వరుడికి 108 వంటకాలతో తయారు చేసిన నైవేద్యాలను సమర్పించారు. కాలనీలోని 50 మంది మహిళలు వీటిని తయారు చేశారు. అనంతరం కాలనీలో వూరేగింపుగా తీసుకొచ్చి మండపంలోని బొజ్జగణపయ్య ముందు పెట్టారు. ప్రధాన పూజారి వినయ్‌శర్మ గణపతికి పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు ప్రసాదాలుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సాయిగణేశ్ కాలనీ ఉత్సవ కమిటీ ప్రతినిధులు నల్ల సంతోష్‌రెడ్డి, గౌరు రామచంద్రారెడ్డి, మల్హాల్‌రావు, బూరచేరాలు, సదాశివరెడ్డి, నరహరి తదితరులు పాల్గొన్నారు.

# కల్వర్టుల వద్ద బాంబు స్క్వాడ్ తనిఖీలు

డోర్నకల్ : మహబూబాబాద్ జిల్లా బాంబు స్క్వాడ్ కల్వర్టుల వెంట గురువారం తనిఖీలు నిర్వహించింది. డోర్నకల్ నుంచి మొదలుకుని గొల్లచర్ల, బలపాల, రాజోలు, మొగిలిచర్ల మీదుగా సలార్ తండా వరకు ఈ తనిఖీలు చేపట్టింది. సిబ్బంది నరేశ్, అశోక్, మహేశ్ విలేకరులతో మాట్లాడుతూ ఎస్పీ కోటిరెడ్డి ఆదేశానుసారం తాము దశల వారీగా ఈ తరహా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొన్నటికి మొన్న పట్టణాలు, గ్రామాల్లోని ముఖ్య కూడళ్లలో ఈ తనిఖీలు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు రహదారుల వెంట కల్వర్టులపై దృష్టి కేంద్రీకరించినట్లు చెప్పారు. ఎవరికైనా ఎక్కడైనా అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే సమీపంలోని రక్షక భట నిలయానికి సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

### విద్యుత్తు కార్మికుల ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే

నర్సంపేట: ఐఎన్‌టీయూసీ 326వ నంబర్ సంఘం విద్యుత్తు కార్మికులు నర్సంపేటలో ద్విచక్ర వాహన ర్యాలీని చేపట్టారు. ఈ ర్యాలీని నర్సంపేట ఎమ్మెల్యే మాధవరెడ్డి జెండా వూపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యుత్తు శాఖలో గుర్తింపు సంఘం కోసం జరుగుతున్న ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీని గెలిపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మురళీధర్, శ్రీనివాస్, రవీందర్ రావు, రామానంద్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి ముందు మృతదేహంతో ధర్నా

## న్యాయం చేయాలంటూ డిమాండ్



జులైవాడ : నగరంలోని పోస్టల్‌కాలనీలో నివాసముంటున్న చెవులపల్లి తిరుపతిరావు ఇంటి ముందు వరంగల్ రూరల్ జిల్లా పర్వతగిరి మండలం చింత నెక్కొండ గ్రామ శివారు బోటికాడితండాకి చెందిన భూక్య అస్లీ (36) మృతదేహంతో కుటుంబ సభ్యులు ధర్నా చేశారు. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. చింతనెక్కొండ గ్రామశివారు బోటికాడి తండాలో భూక్యఅస్లీ భర్త వీరన్న కుటుంబానికి కొన్ని దశాబ్దాలుగా 1.20 గుంటల భూమి ఉంది. వీరన్న కుటుంబానికి తెలియకుండా అదే గ్రామానికి చెందిన తిరుపతిరావు పోర్జరీ సంతకాలతో నకిలీ పత్రాలు సృష్టించి పట్టాదారు పాసు పుస్తకాలు చేయించుకున్నాడని గత కొంతకాలంగా వివాదం జరుగుతుంది. గత నెల 22న భూక్య అస్లీ తన భూమిలో పనులు చేస్తుండగా సదరు వ్యక్తి కొంతమందిని పంపించి ఆమెపై దౌర్జన్యం చేశారన్నారు. ఈ విషయమై అదే రోజు పర్వతగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఆమెపై దాడి చేయగా అవమానం భరించలేక అదే రోజు పురుగుల మందు తాగిందన్నారు. ఆమెను హన్మకొండలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. ఆమె మృతికి కారణమైన పోస్టల్ కాలనీలో నివాసముంటున్న సదరు వ్యక్తి ఇంటి ముందు వారి బంధువులు మృతదేహంతో బైఠాయించారు. వారికి లంబాడ హక్కుల సంఘం నాయకులు మద్దతు తెలిపారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న సుబేదారి సీఐ శ్రీనివాస్, పర్వతగిరి సీఐ సత్యనారాయణ, సుబేదారి ఎస్సైలు ప్రవీణ్‌కుమార్, సతీష్, నవీన్‌లు పోలీసులు రంగప్రవేశం చేశారు. సాయంత్రం 7 గంటల వరకు బాధితురాలి కుటుంబ సభ్యులతో చర్చించారు. ఈ విషయంపై న్యూస్‌టుడే తిరుపతిరావును వివరణ కోరగా 1998 నుంచి ఆ భూమి వారసత్వంగా వస్తుందన్నారు. రెవెన్యూ పరంగా అన్ని రికార్డులు తమ వద్ద ఉన్నాయన్నారు. కావాలని ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు.

# ప్రేమలో పడి పోలీసులకు చిక్కిన దొంగ

## తెలివిగా పట్టుకున్న పోలీసులు



నిజామాబాద్ : నిజామాబాద్ నగరంలోని నాందేవ్‌వాడలో ఓ ఇంట్లో జులై 21వ తేదీన దొంగతనం జరిగింది. చోరీ జరిగిన ప్రదేశంలో పోలీసులకు ఏ ఆనవాళ్లు దొరకలేదు. కనీసం వేలిముద్రల ఆధారాలు కూడా పక్కాగా లేవు. ఇంతలో ఆగస్టు 3న మరో చోరీ జరిగింది. ఇక్కడా అదే పరిస్థితి. కనీసం దర్యాప్తులో ఎలా ముందుకు వెళ్లాలో అంతుచిక్కట్లేదు. ఇంతలోనే చోరీలకు పాల్పడ్డ ఆ దొంగ ఓ యువతితో ప్రేమలో పడ్డాడు. తీరా పోలీసులకు చిక్కాడు. ఈ కేసుకి సంబంధించి పూర్తి వివరాలు నగర సీఐ సుభాష్ చంద్రబోస్, మూడో ఠాణా ఎస్సై శ్రీహరి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సిరిసిల్ల జిల్లాకు చెందిన శామల వెంకటేశ్ అలియాస్ శ్రీనివాస్‌కు నా అనేవాళ్లు ఎవరూ లేరు. ఒంటరి జీవితానికి అలవాటు పడిన ఇతను జల్సాలకు బానిసగా మారాడు. ఇంతలోనే దొంగతనాలు చేయటం ప్రారంభించాడు. నేరేళ్ల, సిరిసిల్ల, వేములవాడ, ఎల్లారెడ్డిపేట్ ప్రాంతాల్లో ఇతనిపై దాదాపు 30 చోరీ కేసులు ఉన్నాయి. కరీంనగర్ జిల్లాలో పోలీసులకు పట్టుబడుతుండటంతో నిజామాబాద్ జిల్లాను ఎంచుకున్నాడు. తదనంతరం జులై 21న నగరంలోని మూడో ఠాణా పరిధిలో కార్పొరేటర్ కడారి శ్రీవాణి ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. ఆగస్టు నాందేవ్‌వాడలోని భాస్కర్ అనే వ్యక్తి ఇంట్లో చోరీ చేశాడు. ఇక్కడే ఓ చీటీ రాసి వెళ్లటం అప్పట్లో చర్చనీయాంశం అయింది. తదనంతరం పోలీసులు దర్యాప్తు చేపట్టగా ఎటువంటి ఆధారాలు దొరకలేదు. తీరా రైల్వే స్టేషను సమీపంలోనే చోరీలు జరుగుతుండటంపై అనుమానం వచ్చి రైల్వే స్టేషనులో రెక్కీ ఉంచారు. నిందితుడు వెంకటేశ్ అనుమాస్పదంగా తిరుగుతుండగా సిబ్బంది అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు.

నిందితుడు ఇక్కడ దొంగతనాలు చేసి ముంబయికి వెళ్లి అక్కడ జల్సాలు చేసేవాడు. చోరీ చేసిన మొత్తాన్ని అక్కడ ఖర్చుచేసి తిరిగి దొంగతనాలకు రైలులో వచ్చేవాడు. ఇదే క్రమంలో నిజామాబాద్ రైల్వేస్టేషనులో భిక్షాటన చేసుకొని జీవించే ఓ యువతిని చూసి ఇష్టపడ్డాడు. ప్రేమించి పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఆ అమ్మాయిని చూసేందుకు ఇప్పటికి ఎన్నోసార్లు నిజామాబాద్‌కు రైల్వేస్టేషనుకి వచ్చి వెళ్లాడు. తాజాగా రైల్వే స్టేషనులో యువతిని వెతుకుతున్న క్రమంలో పోలీసులు పట్టుకున్నారు.

నాందేవ్‌వాడలో భాస్కర్ అనే వ్యక్తి ఇంట్లో చోరీ చేసిన క్రమంలో గోడపై కుటుంబం ఫొటోలు కనిపించాయి. అందులో చిన్నపిల్లలు ఉండటం చూసి ఓ చీటీ రాసినట్లు పోలీసులకు వెల్లడించాడు. మానవత్వంతోనే మీకు దేవుడు డబ్బులు ఇంకా ఇస్తాడని చీటిలో రాసి వెళ్లినట్లు నిందితుడు పోలీసులకు తెలిపాడు.

ఈ దొంగతనాలకు సంబంధించి పోలీసులకు ఎటువంటి ఆధారం లేదు. అయినా ఏమాత్రం వెనక్కు తగ్గకుండా సీఐ సుభాష్ చంద్రబోస్ నేతృత్వంలో ఎస్సై శ్రీహరి బృందం దర్యాప్తుని ముందుకు సాగించింది. మామూలు వ్యక్తిలా తిరిగిన దొంగను అనుమానించి బంగారు నగలు కూడా రికవరీ చేశారు. నిందితుడి నుంచి మొత్తం 7 తులాల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. ఎక్కడ చోరీకి వెళ్లినా గంజాయి మత్తులో వెళ్లి స్క్రూడ్రైవర్ సాయంతో తాళాలు తీసేవాడని పోలీసులు వెల్లడించారు. కేసు దర్యాప్తులో సీఐ సుభాష్ చంద్రబోస్, ఎస్సై శ్రీహరి, సిబ్బంది రాములు, సురేందర్, కేర్బాజి, భూపతి, సుభాష్‌లను ఉన్నతాధికారులు అభినందించారు. ప్రత్యేక రివార్డు అందించటం జరగుతుందని తెలిపారు.

# అధిక స్వేచ్ఛను పిల్లలకు ఇవ్వకూడదు




ఎంతో మంది పిల్లలు తల్లిదండ్రుల దగ్గర ఎక్కువగా గారాబంగా ఉండి కోన్ని విషయాలలో చేయారాని విషయాలు చేస్తుంటారు. తల్లితండ్రులనుంచి చాలా గారాబం పొందే పిల్లలకు ఏ నియమాలు కాని, నిరాశ కాని, వస్త్రధారణ నియమనిబంధనలు కాని మర్యాద కాని ఉండవని మీరు అనుకుంటారు. నిజమే, కాని వారు ఒక్కరే కాదు. మీ అలవాట్లలో కొన్నిటి మూలంగా మీరు గారాబం చూపించే తల్లితండ్రుల కేటగిరి క్రిందకు వస్తారు అంటే మీరు ఆశ్చర్యపోతారు, నిపుణుల ప్రకారం కూడా, మీరు మీ పిల్లల పట్ల చేస్తున్నది సరిఅయినదిగా భావిస్తుంటారని తెలుస్తున్నది.

చాలామంది తల్లితండ్రులు వారివారి పాత్రను తప్పుగా అర్థం చేసుకుంటున్నారు అని పేరెంటింగ్ ఎక్సుర్ట్ లియోనార్డ్ సాక్స్, చెస్టర్ దేశం లోని ఫామిలి డాక్టర్, గర్ల్స ఆన్ ది ఎడ్జ్ అండ్ బాయ్స్ అడ్రిఫ్ట్' రచయిత చెపుతున్నారు. తమ పిల్లలని టాప్ కాలేజ్‌లో సీట్ సంపాయించటం వాళ్ల నిరాశకు గురి కాకుండా ఉండేందుకు మాత్రమే వారి పాత్ర ఉంటుందని చాలామంది తల్లితండ్రుల అభిప్రాయం. క్లిష్ట పరిస్థితులలో రక్షణ వలయంలాగా తల్లితండ్రులు ఉండాలి కాని పిల్లలని కూడా వాటి యొక్క పరిణామాలను తెలుసుకోగలిగే అవకాశాన్ని,తెలివిని పెంపొందించుకోని వ్వాలి. ఇక్కడ సాధారణంగా తల్లిదండ్రులు ఎందుకు, ఎలా పిల్లలని గారాబం చేస్తారో 5 పాయింట్లలో చెపుతున్నాం.


1. వివాదానికి దూరంగా ఉండటం చాలామంది తల్లితండ్రులు పిల్లలతో వాదనలు పెంచుకోవటం కన్నా వారి కోరికలని తీర్చటం సులభం అనుకుంటారు, ఫలి తంగా పిల్లలు తల్లి తండ్రులను అలుసుగా తీసుకుంటు న్నారు. ఈ విషయం చాలామంది తల్లితండ్రులలో చూస్తున్నాము. వారు పిల్లల పట్ల కతినంగా ఉండటానికి ఇష్టపడరు.

2. స్కూల్ పని ఒక వంక స్కూల్ హోం వర్క్ సాకుతో చాలా మంది పిల్లలు ఇంట్లో వారి బాధ్యతలనుండి తప్పించుకుం టున్నారు ఎందుకంటే తల్లితండ్రులు చదువుకి సంబంధిం చిన విషయాలపట్ల చాలా శ్రద్ధ చూపిస్తారు. 3. పిల్లలని తమ స్నేహితులలాగా చూడటం కొంతమంది తల్లి తండ్రులు తమ పిల్లలని, అధికారికంగా కాకుండా స్నేహి తులలాగా ఉండాలన్న ప్రయత్నంలో చాలా గారాబం చేస్తారు. 4. నిత్యకృత్యాలు లేదా పరిమితులు లేవు చాలామంది తల్లితండ్రులకు పిల్లలని పెంచటంలో ప్రణాళిక లేకపోవ టం ఒక లోపంగా ఉంటున్నది.

దీనితో, వారి సంసారం లోనే క్రమశిక్షణ లేకపోవటం వలన పిల్లలు కూడా క్రమశిక్ష ణారాహిత్యంగా తయారవుతున్నారు. 5. టెక్నాలజీ పేరుతో పిల్లలకి బహుమతులు ఈ రోజుల్లో చిన్నవాళ్లకి చిన్న వయస్సున్న పిల్లలకి కూడా మొబైల్ ఫోన్ ఉంటున్నది ఎందుకంటే వారి తల్లితండ్రులను అడిగి, అలిగి మరీ తీసుకుంటున్నారు. కాని ఇది మంచిది కాదు.




# కొలస్ట్రాల్ పై... కొన్ని అపోహాలు !



శరీరంలోని జీవక్రియలన్నీ సక్రమంగా జరగాలంటే అందుకు ప్రోటీనులు, విటమిన్స్, పోషకాంశాలు ఎంత ముఖ్యమో కొలెస్ట్రాల్ కూడా అంతే ముఖ్యం. శరీరంలోని జీవక్రియలు సక్రమంగా పనిచేయడానికి కొలెస్ట్రాల్ కూడా కావాల్సిన స్థాయిలో ఉండాలి. అదే శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయి అవసరానికి మించి పెరుగుతే అది ఆరోగ్యం మీద తీవ్రంగా చెడు

*ప్రభావాన్ని చూపెడుతుంది. శరీరంలో అధనంగా కొలెస్ట్రాల్ పెరగడం వల్ల స్ట్రోక్ (మూర్ఛవ్యాధికి)కారణం అయ్యే బ్లాకేజ్ లు రక్తం ఏర్పడుతాయి. ఇంకా గుండె సంబంధిత సమస్యలు కూడా అధికంగా వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అందుకు కారణం హై కొలెస్ట్రాలే. కొలెస్ట్రాల్ ను తరచూ అపార్థం చేసుకొంటాం. మనలో ఉండే కొలెస్ట్రాల్ గుండె జబ్బుల ప్రమాదాలను పెంచుతుందనే సమాచారం కోకొల్లలుగా ఉంది. కాని దీనిలో చాల వరకు కేవలం కల్పితమే. అదెలాగో చూద్దాం..*

**కొలెస్ట్రాల్ గూర్చి మనలో ఉన్న తప్పుడు అపోహలు!**

అధిక కొలెస్ట్రాల్ కేవలం మగవారికి మాత్రమే సంబంధించినది- ఆడవారికి కాదు. స్త్రీల దగ్గర ఈస్ట్రోజెన్ ఉంది. ఇది కొలెస్ట్రాల్ మోతాదును సాధారణ స్థాయిలో ఉంచేందుకు సాయపడుతుంది. అయితే మెనోపాజ్ తర్వాత ఈ ప్రయోజనం ఉండదు. 45 దాటిన మగవారు, 55 దాటిన ఆడవారిలో కొలెస్ట్రాల్ వలన ప్రమాదం ఉంది.

అధిక కొలెస్ట్రాల్ అనేది జన్యుపరమైనది, దీనికి మనం చేయదగినది ఏది లేదు. జన్యువులు తప్పనిసరిగా తమ పాత్రను పోషిస్తాయి, అయితే ఆహార అలవాట్లు, జీవనశైలి విధానం కొలెస్ట్రాల్ స్థాయిపై ప్రభావం చూపిస్తాయి. మన కుటుంబంలో అధిక కొలెస్ట్రాల్ చరిత్ర ఉంటే, మీరు నివారణ చర్యలు చేపట్టి మీ మోతాదు స్థాయి మించకుండా చర్యలు చేపట్టండి.

**కొలెస్ట్రాల్ ను విజయవంతంగా ధ్యానం ద్వారా తగ్గించవచ్చు.** మీకు అధిక కొలెస్ట్రాల్ ఉందని తెల్సి నప్పుడు, కారణం తెల్సుకోవడం ముఖ్యం. తరచుగా మీరు కారకాలను సరిచేస్తుంటే, అది సాధారణ స్థితికి చేరుతుంది. కారణాలలో సరైన ఆహారంలేకపోవడం, తగినంత వ్యాయామం లేకపోవడం, అంటురోగాలు, మానసిక ఒత్తిడి, శారీరిక ఒత్తిడి ( సర్జరీ వంటివి) వంటివి ఉంటాయి.

కొలెస్ట్రాల్ తగ్గించే మందులను వాడినప్పుడు ఆహార అలవాట్లను మార్చవలసిన అవసరం లేదు లేదా ఎక్కువ చురుకుగా ఉండక్కరలేదు. కొలెస్ట్రాల్ ను తగ్గించే మందులు కొంత వరకు పనిచేస్తాయి. కాని మన గుండెకు మంచిదనుకొనే ఆహారాన్ని తీసుకొని, మన జీవన శైలిని మార్చినప్పుడు మీ మందులు బాగా పనిచేస్తాయి.

భోజనం గుండెకు - ఆరోగ్యం అంటే అర్థం 0 మి.గ్రా. కొలెస్ట్రాల్ పోషకాహార జాబితాలో మంచి కొలెస్ట్రాల్ అనే కొలెస్ట్రాల్ భాగం, మీ కొలెస్ట్రాల్ మోతాదును పై స్థాయికి తీసుకొని పోయే విషయ మౌతుంది. సాచ్యురేటెడ్ ఫాట్ (మాంసాహారం, డైరీ ఉత్పత్తులు) ట్రాన్స్ ఫాట్స్ (ప్యాక్ చేసిన ఆహారంలో ఉండేది) చాల వరకు తక్కువ సాంద్రత లిపోప్రొటీన్ పై పెద్దగా ప్రభావం ఉండదు, చెడు కొలెస్ట్రాల్ అనేది మంచి కొలెస్ట్రాల్ కంటే అతేరోస్కిరోసిస్ కు కారణమౌతుంది.



పిల్లలకు అధిక కొలెస్ట్రాల్ ఉండదు అతేరోస్కి రోసిస్ - ధమనులు కుచించుకొని పోయి గుండెజబ్బులకు దారి తీయడం - అనేది ఎనిమిదేళ్ళ చిన్న వయసు లోనే మొదలు కావచ్చని పరిశోధనలు తెలియచేస్తున్నాయి. అమెరికా పిడియాట్రిక్ అకాడమి వారు పిల్లలు, కొలెస్ట్రాల్ అనే విషయంపై సూచనలు చేస్తూ అధిక బరువు ఉన్న పిల్లలు, అధికరక్తపోటు లేదా కుటుంబంలో గుండెజబ్బుల చరిత్రను ఉన్నవారికి రెండేళ్ళ వయసులోనే కొలెస్ట్రాల్ పరీక్ష చేయించాలని తెలిపారు. అధిక కొలెస్ట్రాల్ ఉన్న పిల్లలు సంతృప్త కొవ్వు, ఆహార కొలెస్ట్రాల్ వరకు ఆహారపు అలవాట్లను పరిమితం చేసి, మరింత వ్యాయామం చేయమని సూచించారు.

భోజనం గుండెకు - ఆరోగ్యం అంటే అర్థం 0 మి.గ్రా. కొలెస్ట్రాల్ పోషకాహార జాబితాలో మంచి కొలెస్ట్రాల్ అనే కొలెస్ట్రాల్ భాగం, మీ కొలెస్ట్రాల్ మోతాదును పై స్థాయికి తీసుకొని పోయే విషయమౌతుంది. సంతృప్త కొవ్వు ( ాంసాహారం, డైరీ ఉత్పత్తులు) ట్రాన్స్ ఫాట్స్ (ప్యాక్ చేసిన ఆహారంలో ఉండేది) చాల వరకు తక్కువ సాంద్రత ఉన్న లిపోప్రొటీన్ పై పెద్దగా ప్రభావం ఉండదు, చెడు కొలెస్ట్రాల్ అనేది మంచి కొలెస్ట్రాల్ కంటే అతేరోస్కిరోసిస్ కు కారణమౌతుంది.

కొలెస్ట్రాల్ ఎల్లప్పుడు చెడ్డది చాలామంది కొలెస్ట్రాల్ అని విన్నప్పుడు అది చెడ్డది అనుకుంటారు. కాని అసలు విషయం చాల క్లిష్టమైనది. అధిక కొలెస్ట్రాల్ ప్రమాదకరం కావచ్చు. కాని కొలెస్ట్రాల్ శరీర ప్రక్రియలు జరగడానికి అత్యవసరం, మెదడు లోని నాడీ కణాలను ఉత్తేజితం చేయడం నుండి కణత్వచాలకు రూపాన్ని ఇవ్వడం వరకు పని చేస్తుంది. గుండె జబ్బులలో కొలెస్ట్రాల్ పాత్రను తప్పుగా అర్థం చేసుకుంటారు. కొలెస్ట్రాల్ రక్తనాళాల నుండి తక్కువ, ఎక్కువ సాంద్రత ఉన్న లిపోప్రొటీన్ ల ద్వారా రవాణా చేయబడుతుంది. ఎల్ డి ఎల్ అంటే చెడు కొలెస్ట్రాల్. ఇది అతేరోస్కిరోసిస్ కు కారణమౌతుంది అంతేకాని కేవలం కొలెస్ట్రాల్ కాదు.

తక్కువ కొలెస్ట్రాల్ ఎల్లప్పుడు మంచి ఆరోగ్యానికి సంకేతం తక్కువ స్థాయి ఎల్ డి ఎల్ కొలెస్ట్రాల్ సాధారణంగా ఆరోగ్యకరమైనప్పటికి, ఒక కొత్త పరిశోధన ప్రకారం సాధారణంగా అసలు క్యాన్సర్ రాని వారి కంటే క్యాన్సర్ వచ్చే వారిలో తక్కువ స్థాయి ఎల్ డి ఎల్ ను క్యాన్సర్ వచ్చే ముందు ఏళ్ళలో ఉన్నట్లు ఒక కొత్త పరిశోధనలో తెల్సుకున్నారు. రక్తంలో తక్కువ కొలెస్ట్రాల్ ఉన్న వారు అనేక వ్యాధులకు కూడా గురి ఔతారు. చాల కాలం వీటితో బాధపడి, ఈ వ్యాధితోనే చనిపోతారు.

అధిక కొలెస్ట్రాల్ ఉన్న లక్షణాలు కనబడటం లేదు అధిక కొలెస్ట్రాల్ ఉన్న వారిలో కొంతమందికి పసుపు - ఎరుపు గ్జంతోమస్ అనే గడ్డలు కనురెప్పలు, కీళ్ళు, చేతులు, శరీరంలోని ఇతర భాగాల మీద వస్తాయి.

మధుమేహం లేదా అనువంశికంగా ఫామిలియాల్ హైపర్ కొలెస్ట్రోలేమియా ఉన్నవారిలో ఈ గ్జంతోమస్ సాధారణంగా ఉంటుంది. మీకు అధిక కొలెస్ట్రాల్ ఉన్నదా లేదా అనే విషయం తెల్సుకోవడానికి మంచి మార్గం, మీ ఆరోగ్యాన్ని పరిరక్షకులు సలహా ఇస్తే మీకు 20 ఏళ్ళు వచ్చినప్పటి నుండి ప్రతి మూడేళ్ళ కొకసారి కొలెస్ట్రాల్ ను పరీక్షించుకోవాలి లేదా మీ డాక్టర్ సలహా ఇస్తే తరచు పరీక్ష చేయించుకోవాలి.

కొలెస్ట్రాల్ స్థాయి తగ్గితే మందులను వాడటం ఆపేయవచ్చు. మీ కొలెస్ట్రాల్ మందులను వాడటం ఆపేస్తే, మీ చెడు ఎల్ డి ఎల్ కొలెస్ట్రాల్ బహుశ తిరిగి అది ఉన్న చోటుకే రావచ్చు. మీ కొలెస్ట్రాల్ మోతాదు మించితే, మీ గుండె జబ్బులు, పోటు పరిస్థితి కూడా అంతే. అధిక కొలెస్ట్రాల్ ను నయం చేయలేనప్పుడు, ఇలా వాడకం విజయవంతంగా నిర్వహించవచ్చు. కొలెస్ట్రాల్ నిర్వహణ మీ జీవిత కాలమంతా ఆరోగ్యాన్ని జాగ్రత్తగా ఉంచుకోవడానికి అవసరం - ప్రతి రోజు వాడే మందులతో సహా.

అధిక కొలెస్ట్రాల్ సన్నగా ఉండే వారిలో పెద్ద సమస్యేమి కాదు సన్నని, అధిక బరువు, లేదా మధ్య రకం ఎవరైనా సరే తమ కొలెస్ట్రాల్ ను తరచూ పరీక్షించుకోవాలి. అధిక బరువు ఉన్న వారు ఎక్కువ కొవ్వు ఉన్న ఆహరం తీసుకోరాదు. అలాగే త్వరగా బరువు పెరగని వారు ఎంత సంతృప్త కొవ్వులు తింటున్నామో చూసుకోవాలి.

వెన్న కాకుండా వనస్పతిని వాడట0 వలన కొలెస్ట్రాల్ తగ్గుతుంది. వనస్పతిలో, వెన్న లాగే కొవ్వు ఎక్కువగా ఉంటుంది - మీకు అధిక కొలెస్ట్రాల్ ఉంటే అన్ని కొవ్వు ఆహారాలు మితంగా తినాలి. చాలావరకు వనస్పతిలో అధిక కొలెస్ట్రాల్ కు కారణమైన ఒక ప్రధాన సంతృప్త కొవ్వులు ఉంటాయి. సూచించబడిన ఎంపికలో ఒక ద్రవరూపంలోని విజిటబుల్ నూనె లేదా ఏ రకమైన ట్రాన్స్ కొవ్వులు లేని నూనె (హైడ్రోజనేటేడ్ విజిటబుల్ నూనె) ఉన్నాయి.

మీరు మధ్య వయస్సు వారయ్యే వరకు మీ కొలెస్ట్రాల్ ను చూపెట్టుకొనే అవసరం లేదు పిల్లలు అయినప్పటికీ - గుండె జబ్బుల కుటుంబ చరిత్ర ఉన్నవారు - అధిక కొలెస్ట్రాల్ స్థాయిని కల్గి ఉండవచ్చు.

చిన్న వయసులోనే కొలెస్ట్రాల్ స్థాయిని పరీక్షించుకోవడం ఒక మంచి ఆలోచన.

# గ్రీన్‌టీలో ... ఔషధ గుణగణాలు



పొద్దున్నే టీ కప్పు కనిపిస్తే మనిషికి ఉదయించే సూర్యుణ్ణి చూసినంత ఆనందం కలుగుతుంది. టీ మాధుర్యాన్ని చవి చూసిన ఆనందంలో కొందరు పాలు కలపడానికి కూడా ఇష్టపడక ఏకంగా బ్లాక్ టీనే తాగడం మొదపూట్టారు. ఈ క్రమంలోనే ఇటీవల గ్రీన్ టీ పట్ల మోజు బాగా పెరుగుతోంది. ఆరోగ్యపరమైన ఎన్నో సమస్యలకు గ్రీన్ టీ మంచి ఔషధంలా పనిచేస్తుంది. అందుకే దీన్ని తీసుకునేవారి సంఖ్య ఇటీవల బాగా పెరుగుతోంది. గ్రీన్ టీలోని విశేషాలను, ఔషధ గుణాలను మరింత లోతుగా పరిశీలిస్తే.... గ్రీన్ టీని తయారుచేయడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. టీ ఆకులో ఉండే సహజమైన ఆకుపచ్చదనాన్నీ, పరిమళాన్నీ నిలబెట్టే ప్రయత్నం ఈ తయారీలో ఉంటుంది. నిజానికి పూర్వకాలం నుంచే గ్రీన్ టీ వినియోగం ఉంది. అయితే, ఇప్పుడు ఆ ప్రాచీన విజ్ఞానానికి కొంత ఆధునిక అవగాహన జత చేయడం ద్వారా గ్రీన్ టీ ప్రయోజనాలు రెట్టింపు అవుతున్నాయి. వ్యాధి నిరోధక శక్తి కలిగిన యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండడం గ్రీన్ టీలోని ఒక ప్రధాన విశేషం. బరువు తగ్గించడంలో అద్భుతమైనది మార్గం గ్రీన్ టీ, గ్రీన్ టీ డైట్ వల్ల శరీరంలోని అనేక వ్యాధులు క్యాన్సర్, రక్తంలోని హై కొలెస్ట్రాల్ లెవల్స్ మరియు డయాబెటిస్ వంటివి అనేక రుగ్మతలను నివారించడంలో అద్భుతమైన మార్గం గ్రీన్ టీ డైట్. మరి మీ డైట్ లో గ్రీన్ టీ తీసుకోవడం వల్ల కలిగే అనేక ప్రయోజనాలేంటో ఒక సారి చూద్దాం...

**1. వేగగంగా బరువు తగ్గిస్తుంది** : గ్రీన్ టీ లో ఉన్న యాంటీఆక్సిడెంట్లు ముఖ్యంగా, ఉదరంలో ఉన్న శరీరాన్ని ఉత్తేజపరిచే కాలరీలను తగ్గించి బరువు తగ్గించి, శరీరంలోని కొవ్వును తగ్గిస్తుంది.అధికబరువుతో బాధ పడేవారికి 'గ్రీన్‌టీ' ఓ చక్కని పరిష్కారం. కొవ్వును తగ్గించడంలో 'గ్రీన్‌టీ' చాలా ఉపయోగపడుతుందని నిపుణులు అంటున్నారు. ఉరుకులు, పరుగుల జీవితంలో అధికబ రువుతో అనారోగ్యాల పాలవుతున్న వారికి 'గ్రీన్‌టీ' దివ్యౌషదం అని చెబుతు న్నారు. **2. డయాబెటిస్‌ను దూరంగా ఉంచుతుంది** : డయాబెటీస్ బాధితులకు ఇది ఎంతగానో ఉ వ యెా గ వ డ ు త ు ం ది. ప్రాథమిక ధశలో ఉంటే ఈ 'టీ' మంచి ఫలితాలను ఇస్తుంది. బ్లడ్‌షుగర్ బాధితులకు కూడా ఎంతో మేలు చేస్తుంది. **3. కొలెస్ట్రాల్ ను తగ్గిస్తుంది:** గ్రీన్‌టీలో మెం డుగా వున్న రెస్‌పెరటాల్ అనే పదార్థం శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను అదుపులో వుంచుతుంది. దీనితో, రక్తనాళాలలో చెడు కొలెస్ట్రాల్ వలన రక్తం గడ్డకట్టిపోదు. తద్వారా గుండెపోట్ల వంటివి నివారించబడతాయి. **4. క్యాన్సర్‌ను నిరోధిస్తుంది:** (టీ లో కనిపించే యాంటీఆక్సిడెంట్లు) టీ లోని పాలీఫేనాల్స్ వల్ల, ఒక కప్పు టీ లో కాన్సర్ ఎదుర్కొనే సామర్థ్యం ఎక్కువగా ఉంటుంది. అయితే పరిశోధన అసంపూర్తిగా ఉన్నప్పటికీ, టీ లో పాలీఫేనల్స్ అధికంగా ఉన్నట్లు ఆధారాలు ఉన్నాయి, ముఖ్యంగా కాటచిన్స్, కాన్సర్ నివారణకు సంబంధించిన జీవకార్యకలాపాలను కలిగి ఉండవచ్చు. **5. దంత సమస్యలను నివారిస్తుంది:** టీ లో సహజమైన ఫ్లోరైడ్లు, దంతక్షయాన్ని నివారించడానికి సహాయపడే రసాయనాలు స్వల్ప పరిమాణంలో కలిగిఉంటాయని ఆమె చెప్పారు. ఫ్లోరైడ్ లాలాజలంతో కలిసినపుడు, బాక్టీరియా కావిటీస్ ప్రోత్సహించే ఉత్పత్తులుగా ఆమ్లాలను ఉత్పత్తి చేయదు. అదనంగా, ఫ్లోరైడ్ ప్రారంభ దశలో ఉన్న దంతక్షయాన్ని నివారించడానికి పనిచేస్తుంది. **6.వ్యాధినిరోధకతను మెరుగుపరుస్తుంది:** ఈ గ్రీన్‌టీ' రోగనిరోధక శక్తిని పెంచుతుంది. **7. ఆర్థరైటిస్ (కీళ్ళనొప్పుల)ను మాయం చేస్తుంది:** బోన్‌వూఫాక్చర్ అయినప్పుడు గ్రీన్‌టీ ఎంతో లాభదాయకం, తిరిగి ఆరోగ్యకరమైన ఎముకల నిర్మాణం జరుగుతుంది. బోన్స్ పటిష్టంగా, దృఢంగా తయారవుతాయి.

**8. బ్యూటీ బెనిఫిట్స్:** గ్రీన్‌టీ తీసుకోవడం వల్ల కాంతివంతమైన చర్మం కూడా మీ సొంతం అవుతుంది. ఇది పూర్తిగా ప్రకృతి సిద్ధమైనది కావడంతో ఎలాంటి సైడ్‌ఎఫెక్ట్స ఉండవు. ప్రతిరోజు 2 నుంచి 5 కప్పుల 'గ్రీన్‌టీ' తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారు. గ్రీన్‌టీలో ఉండే బలమైన యాంటి ఆక్సిడెంట్లు వృద్ధాప్యాన్ని కొంతమేరకు నిలుపుచేస్తాయి.

శరీరంలోని డిఎన్ఎ దెబ్బతినకుండా నిరోధించడం ద్వారా వృద్ధాప్యాన్ని ఆలస్యం చేస్తుంది. చర్మం ముడుతలు పడటం తగ్గిస్తుంది.

# కూర్చోవడం ఎలా?

మనం కూర్చుంటున్న విధానాల గురించి ముందు పరిశీలిద్దాం. మన చుట్టూ కొన్ని వందల సంవ త్సరాల నుంచి రకరకాల కుర్చీలువస్తున్నాయి. కానీ అన్ని కుర్చీల్లోనూ కూర్చోవటం ఎంతవరకు మంచిది? చాలామంది రోజులో గంటల కొద్ది సమయాన్ని కూర్చో వడానికే కేటాయిస్తారు. అది పనిప్రదేశంలో కావచ్చు, ఇంటిదగ్గర కావచ్చు. వాహనంమీద కావచ్చు - ఎక్క డైనా సరిగ్గా కూర్చోకపోతే వెన్ను మీద అదనపు భారం పడుతుంది. దాంతో వెన్నునొప్పి వచ్చి మనల్ని బాధ పెడుతుంది. గుంటలా ఉండి వెనుక కొంతవరకు అను కోవడానికి ఉపయోగించే కుర్చీలు మనకి సౌకర్యంగా అనిపించవచ్చు. కానీ వాటివల్ల కూర్చున్నప్రదేశంలో ఇబ్బంది లేకపోయినా వెన్నుమీద ఒత్తిడి పడవచ్చు. మెడవరకు కుర్చీలో తిన్నగా ఆనుకోవడానికుంటే వెన్ను అంతగా ఇబ్బంది పడకపోవచ్చు. ముందుకి ఒంగి కూర్చోవటం వల్ల కడుపు ప్రాంతంలో ఒత్తిడి కలుగవచ్చు. ఇక్కడ కనిపిస్తున్న బొమ్మని చూడండి ఆభంగిమ గురించి తెలుసుకోండి. -మొదటిది నడుం మీద ఒత్తిడి పడుతుంటుంది. వెన్నుమీద, ప్రేగుల మీద, కడుపుమీద, మూత్రపిండాల మీద, ఎడ్రిన ల్గ్లాండ్స్ మీద, ఉదరవితానం మీద, ఛాతిమీద, మెడ, గొంతుల మీద కూడా ఒత్తిడి పడవచ్చు. దంతాల మీద కూడా ఒత్తిడి పడవచ్చు. దానిని నివారించడం అవసరం. పొట్టకి, తొడకి మధ్య కనీసం 135 డిగ్రీలు ఉండాలి. అలాగే తొడభాగం అంతటికి, కింద పూర్తి ఆధారం ఉండాలి. రెండు పాదాసలూ నేలకు ఆనాలి. నడుంకి కూడా ఆధారం ఉండాలి. ఇలాంటి కూర్చోవడానికి వీలున్న కుర్చీలు మంచిది. ఎదురుగా కంప్యూటర్ గాని, టీవిగాని ఉంటే కళ్ళస్థాయి కంప్యూట్ లేక టీవి పై స్థాయికి సమంగా ఉండాలి. కాళ్ళని క్రాస్‌చేసి కూర్చోవడం, అలాగే చతికిల బడి కూర్చోవడం మంచిది కాదు. కూర్చున్నప్పుడు తొడకంటే మోకాలు పైకి ఉండకూడదు. ఇందాక చెప్పినట్లు 135 డిగ్రీలు ఉండేట్లు తప్పక చూసుకోవాలి. ఇలా ఇంటిదగ్గరె%నా, కార్యాలయాలలో అయినా మంచిది. కారులో కూర్చు న్నప్పుడు కూడా ఈ పద్ధతినే అవలంభించాలి.

ఇంట్లో కొంతమంది పొడుగాటి వాళ్ళు ఉండొచ్చు, కొంతమంది పొట్టివాళ్ళు ఉండవచ్చు. కానీ కుర్చీలు కొనేటప్పుడు పొట్టివాళ్ళను బేస్ చేసుకొని కొంటే మంచిది.

# పైసా వసూల్

చిత్రభాను

## రివ్యూ









ఈ ఏడాది బాలకృష్ణ తన సినీ కెరీర్‌లో అరుదైన మైలురాయిని అందుకున్నారు. 'గౌతమిపుత్ర శాతకర్ణి'తో శతకం కొట్టి, బాక్సాఫీస్ వద్ద మరోసారి తన సత్తా చాటారు. ఎప్పటికప్పుడు కొత్తదనం కోసం ప్రయత్నించే బాలయ్య దర్శకుడు పూరి జగన్నాథ్ చెప్పిన కథకు పచ్చజెండా వూపి అందర్నీ ఆశ్చర్యపరిచారు. మిగతా దర్శకుల సినిమాల్లో కథానాయకుడి పాత్రకు, పూరి సినిమాల్లోని పాత్రకు చాలా 'తేడా' ఉంటుంది. మాస్‌ను దృష్టిలో పెట్టుకునే పూరి తన కథానాయకుడి పాత్రను తీర్చిదిద్దుతారు. ఒకరకంగా చెప్పాలంటే 'చంటిగాడు లోకల్' టైపు. మరి బాలకృష్ణ లాంటి అగ్రకథానాయకుడు ఆ పాత్రలోకి పరకాయ ప్రవేశం చేస్తే? అభిమానులకు, ప్రేక్షకులకు అది 'పైసా వసూల్' లాంటి కిక్ నిచ్చిందా? సరికొత్త కాంబినేషన్ ఆకట్టుకుందా?

కథేంటి: తేడాసింగ్(బాలకృష్ణ).. తీహార్ జైలు నుంచి బయటకు వస్తాడు. దేనికీ భయపడడు. ఎవరినైనా ఎదిరిస్తాడు. మరోపక్క బాబ్‌మార్లే(విక్రమ్‌జీత్) అనే ఇంటర్నేషనల్ మాఫియాడాన్ కోసం భారతదేశ పోలీసులు వెతుకుతుంటారు. అతను పోర్చుగల్‌లో ఉండి ఇండియాలో విధ్వంసాలు స ృష్టిస్తుంటాడు. అతడిని పట్టుకోవాలంటే ఇక్కడి చట్టాలు, ప్రభుత్వాలు అడ్డు వస్తుంటాయి. దీంతో మరో గ్యాంగ్‌స్టర్‌తో అతడిని హతమార్చడమే సరైన మార్గమని భావిస్తాడు 'రా' అధికారి(కబీర్‌బేడి). ఇదే సమయంలో తేడాసింగ్ వీరికి కనపడతాడు. ఈ తేడాసింగ్‌ను ఉపయోగించుకుని బాబ్‌మార్లేను అంతమొందించడానికి స్కెచ్ వేస్తారు. మరి ఆ మాఫియాడాన్‌ను తేడాసింగ్ పట్టుకున్నాడా? అతడిని తుదముట్టించాడా? అసలు ఈ తేడాసింగ్ ఎవరు? తదితర విషయాలను తెరపై చూడాల్సిందే.

ఎలా ఉందంటే: 'పైసా వసూల్' పేరుకు తగ్గట్టుగానే ఈ సినిమా అభిమానులకు ఎంటర్‌టైన్‌మెంట్ వసూలు చేసి మరీ ఇచ్చేలా దర్శకుడు పూరి జగన్నాథ్ తీర్చిదిద్దారు. బాలక ృష? పాత్రను డిజైన్ చేసుకోవడం, ఆయనతో కొత్త తరహా సంభాషణలు పలికించడంలో పూరి వందశాతం సక్సెస్ అయ్యారు. 'తేడాసింగ్' పాత్రలో చాలా వేరియేషన్స్ కనిపిస్తాయి. అవన్నీ అభిమానులకు నచ్చుతాయి. బాలకృష్ణ తెరపై ఎప్పుడు కనిపించినా ప్రేక్షకుడు ఎంటర్‌టైన్ అవుతాడు. ఈ సినిమాకు సంబంధించి ప్రధాన బలం ఆయనే. ప్రతి సన్నివేశంలో బాలకృష్ణ పలికే డైలాగ్‌లు ఉర్రూతలూగిస్తాయి. యాక్షన్ సన్నివేశాలకు దర్శకుడు పెద్దపీట వేశారు. పోర్చుగల్ ఎపిసోడ్ పెద్దదిగా ఉన్నా, పూరి సరికొత్తగా ఆయా సన్నివేశాలను చూపించారు. పూరి గత చిత్రాల ఛాయలు అక్కడక్కడా కనిపిస్తున్నా, మధ్యలో వచ్చే ట్విస్టులు కొత్తగా అనిపిస్తాయి. పూరి కథానాయకుడి పాత్రలో బాలయ్య పరకాయ ప్రవేశానికి నిదర్శనం 'పైసా వసూల్'.

ఎవరెలా చేశారంటే: ఒక కొత్త బాలక ృష?ను చూడాలంటే 'పైసావసూల్' చూడాల్సిందే. ఇందులో బాలకృష్ణ డైలాగ్ డెలివరీ గత సినిమాల్లో ఎక్కడా కనిపించదు. ఇదే ప్రధాన హైలైట్. ఇక బాలయ్య పాడిన పాటకు థియేటర్లో విజిల్స్ పడాల్సిందే. విశ్రాంతి ఘట్టానికి ముందు బాలక ృష? పలికిన డైలాగ్ (ఓన్లీ ఫ్యాన్స్ అండ్ ఫ్యామిలీ, ఔటర్స్ నాట్ అలౌడ్) ఇంకొంత కాలం మార్మోగుతుంది. హీరోయిన్లు ముగ్గురు ఉన్నా అధిక ప్రాధాన్యం శ్రియకు మాత్రమే.

పోర్చుగల్ ఎపిసోడ్‌లో మాత్రమే ఆమె కనిపిస్తుంది. కథకు ఆ పాత్రే కీలకం. కైరా దత్ ఐటమ్ సాంగ్‌లో చిందులు వేయడంతో పాటు ఆమె పాత్ర ఏంటనేది ఆసక్తికరం. ముస్కాన్ ఓ పాట, కొన్ని సన్నివేశాలకు మాత్రమే పరిమితమైంది. కథానాయికల్లో బాలయ్య కెమిస్ట్రీ వర్కవుట్ అయింది శ్రియతోనే. పూరి ప్రతీ సినిమాలో కనిపించే అలీ ఈసారీ ఓ పాత్రను దక్కించుకున్నారు.

కబీర్‌బేడీ ఓ ముఖ్య పాత్రలో కనిపిస్తారు. అతని పాత్ర ఆకట్టుకుంటుంది. మిగిలిన వారు తమ పాత్రల పరిధి మేరకు బాగానే నటించారు. పూరి గత చిత్రాల్లో మాదిరిగానే విలన్ గ్యాంగ్ కనిపిస్తుంది.

దర్శకుడు పూరి జగన్నాథ్ కేవలం బాలకృష్ణ పాత్ర మీదే ద ృష్టి పెట్టారు. సినిమాను కూడా అలాగే డిజైన్ చేశారు. ఆ పాత్ర ప్రేక్షకుడికి 100శాతం ఎంటర్‌టైన్‌మెంట్ ఇస్తుంది. పూరి మాటల పదును అక్కడక్కడా కనిపిస్తుంది. దేశం గురించి, దేశభక్తి గురించి చెప్పిన తీరు అందరికీ నచ్చుతుంది. కథ, కథనాల పరంగా కొద్దిగా తప్పులు దొర్లినా కథానాయకుడి పాత్ర ముందు అవేవీ పెద్దగా కనిపించవు. అనూప్ పాటలు బాగున్నాయి. 'పైసా వసూల్', 'మామా ఏక్ పెగ్‌లా' మాస్‌కు నచ్చుతాయి. కెమేరా పనితనం కూడా ఆకట్టుకుంటుంది. సినిమా నిడివి తక్కువ. చాలా షార్ప్‌గా ఎడిట్ చేశారు. నిర్మాణ విలువలు బాగున్నాయి.

---

# ఇక ఒంటరిగానే..!

ప్రేమ వ్యవహారాల గురించి బాహాటంగా స్పందించడానికి మన కథానాయికలు సంశయిస్తారు. ఒకవేళ ప్రేమలోవున్నప్పటికి అలాంటిదేమి లేదంటూ సమాధానాన్ని దాటవేయడానికి ప్రయత్నిస్తారు. అయితే చెన్నై సోయగం రెజీనా మాత్రం అందుకు భిన్నంగా తన లవ్‌ఎఫైర్‌పై ఆసక్తికరమైన విషయాల్ని వెల్లడించింది. ఒకప్పుడు తాను ప్రేమలో వున్నానని...అనుకోని కారణాల వల్ల ఆ బంధం విఛిన్నమైందని చెప్పింది. అయితే ప్రియుడి పేరును చెప్పడానికి మాత్రం నిరాకరించింది. ఆమె మాట్లాడుతూ గత కొన్నేళ్ల జీవితం నాకెన్నో పాఠాల్ని నేర్పింది. ఆ ఒత్తిళ్ల నుంచి బయటపడి ఇప్పుడు సరికొత్త స్వేఛను అనుభవిస్తున్నాను. మరికొన్నేళ్ల వరకు ఒంటరిగానే వుండాలని నిర?యించుకున్నాను. ఈలోపు నన్ను నేను అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తాను అని చెప్పింది. ఈ అమ్మడి తాజా వ్యాఖ్యలు చెన్నై సినీ వర్గాల్లో ఆసక్తికరంగా మారాయి. ప్రస్తుతం ఈ సుందరి తమిళంలో మూడు చిత్రాల్లో, తెలుగులో హరేరామ హరే క ృష? సినిమాలో కథానాయికగా నటిస్తున్నది.



# త్రివిక్రమ్ కథతో...!

నితిన్ కథానాయకుడిగా పవన్‌కల్యాణ్ క్రియేటీవ్ వర్క్స్, శ్రేష్ట్ మూవీస్ పతాకాలపై సుధాకర్‌రెడ్డి ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మేఘా ఆకాష్ కథానాయక. నిఖిత రెడ్డి సమర్పకురాలిగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి క ృష?చైతన్య దర్శకత్వం వహిస్తున్నారు. తొలి షెడ్యూల్ పూర్తయింది. తాజా షెడ్యూల్ అమెరికాలో జరగనున్నది. ఈ సందర్భంగా నిర్మాత చిత్ర విశేషాలు తెలియజేస్తూ ఇటీవలే హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో కీలక సన్నివేశాల్ని చిత్రీకరించాం. నేటి నుంచి యు.ఎస్‌లో తాజా షెడ్యూల్ మొదలవుతున్నది. దాదాపు 35 రోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో పాటలు, కొన్ని కీలక సన్నివేశాలు, యాక్షన్ ద ృశ్యాల్ని చిత్రీకరించనున్నాం. ఇవి చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. విభిన్నమైన కథతో ఆద్యంతం వినోదాత్మకంగా దర్శకుడు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మాటల మాంత్రికుడుగా పేరుతెచ్చుకున్న ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ ఈ చిత్రానికి అదుతేమైన కథను అందించారు. నితిన్ పాత్ర చిత్రణ, గెటప్ గత చిత్రాలకు పూర్తి భిన్నంగా కొత్త పంథాలో సాగుతుంది. నితిన్ నుంచి ప్రేక్షకులు ఏ అంశాలు కోరుకుంటారో అవన్నీ పక్కాగా కుదిరిన చిత్రమిది. తప్పకుండా అందరిని ఆకట్టుకుంటుందనే నమ్మకముంది అన్నారు. నరేష్, రావు రమేష్, లిజి, ప్రగతి, నర్రాశ్రీను, శ్రీనివాసరెడ్డి, మధు, పమ్మి సాయి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: నటరాజ్ సుబ్రమణ్యన్, సంగీతం: తమన్, కళ: రాజీవ్ నాయర్, ఎడిటింగ్: ఎస్.ఆర్.శేఖర్, కథ: త్రివిక్రమ్, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: క ృష?చైతన్య.





# ప్రభాస్‌పై పిచ్చి ప్రేమ..

ప్రభాస్‌కి లేడీ ఫ్యాన్ ఫాలోయింగ్ చాలా ఎక్కువనే సంగతి అందరికీ తెలిసిందే. 'బాహుబలి' సినిమాకి ముందు తెలుగు రాష్ట్రాలకే పరిమితమైన ప్రభాస్ క్రేజ్.. ఆ తరవాత దేశవ్యాప్తం అయిపోయింది. 'బాహుబలి2' విడుదల తరవాత ఎంతో మంది బాలీవుడ్ హీరోయిన్లు ప్రభాస్‌తో నటించడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఇక మహిళా అభిమానుల విషయానికి వస్తే.. ప్రతి రాష్ట్రంలోనూ అమ్మాయిలు ప్రభాస్ అంటే పడి చస్తున్నారు. కానీ ఇప్పుడు మనం మాట్లాడుకోబోయే అమ్మాయి అంతకు మించి. ప్రభాస్ అంటే తనకు ప్రాణం అంటోంది. ప్రభాస్‌ను పెళ్లిచేసుకోవడానికి తాను దేనికైనా సిద్ధం అంటోంది. త్వరలోనే తన ప్రేమను ప్రభాస్‌కు చెప్పడానికి హైదరాబాద్ వస్తోంది. కోల్‌కతాకు చెందిన సుభద్ర ముఖర్జీ.. ప్రభాస్ అంటే పడిచచ్చిపోతోంది. అక్టోబర్ 23న ప్రభాస్ పుట్టినరోజు నాడు ప్రత్యేకమైన బహుమతులతో ఆమె హైదరాబాద్‌కు వస్తోంది. ప్రభాస్‌ను కలవడానికి ఇప్పటికే ఆయన సెక్రటరీని సంప్రదించిందట సుభద్ర. ఆయన సరేనని భరోసా ఇవ్వడంతో సుభద్ర ఆనందానికి అవధుల్లేవు. ఓ వైపు దసరా నవరాత్రులు దగ్గర పడుతుండటంతో కోల్‌కతాలోని శిల్పులంతా అమ్మవారి విగ్రహాలు తయారుచేయడంలో బిజీగా ఉన్నారు. కానీ ఒక శిల్పి మాత్రం బాహుబలి విగ్రహ తయారీలో మునిగిపోయారు. దానిని తయారు చేయిస్తున్నది సుభద్ర ముఖర్జీయే. అక్షరాలా లక్ష రూపాయలు ఖర్చుపెట్టి బాహుబలి విగ్రహాన్ని సుభద్ర తయారుచేయిస్తోంది.

# సచిన్ జెర్సీ నంబర్ ఎవ్వరికీ ఇవ్వొద్దు!




ఢిల్లీ: సచిన్ తెండుల్కర్ జెర్సీ నంబర్ 10ని ఎవ్వరికీ ఇవ్వొదని అభిమానులు బీసీసీఐని కోరుతున్నారు. అంతేకాదు అది తమకు ఎంతో ప్రత్యేకమైనదని, దాని విలువ వెలకట్టలేనిదని నెటిజన్లు సచిన్‌పై ఉన్న అభిమానాన్ని చాటుతున్నారు. ఆ నంబర్‌ని దయచేసి ఎవ్వరికీ కేటాయించవద్దని విజ్ఞప్తి చేస్తున్నారు.

భారత్-శ్రీలంక మధ్య నాలుగో వన్డే ద్వారా శార్దూల్ ఠాకూర్ వన్డేల్లో అరంగేట్రం చేసిన సంగతి తెలిసిందే. మ్యాచ్ ప్రారంభానికి ముందు అతడు కోచ్ రవిశాస్త్రి చేతులమీదుగా వన్డే క్యాప్‌ని అందుకున్నాడు. తొలుత బ్యాటింగ్ చేపట్టిన భారత్ నిర్ణీత ఓవర్లలో 375 పరుగులు చేసింది. అనంతరం ఫీల్డింగ్ కోసం కోహ్లీ సేన మైదానంలో అడుగుపెట్టింది.

అరంగేట్ర ఆటగాడు శార్దూల్ కూడా మైదానంలోకి వచ్చాడు. శార్దూల్ ధరించిన జెర్సీపై ఉన్న నంబర్ 10ని చూసి అభిమానులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. క్రికెట్ దేవుడు, మాస్టర్ బ్లాస్టర్ సచిన్ తెండుల్కర్ జెర్సీ నంబర్ 10 అని అందరికి తెలిసిందే. దీంతో అభిమానులు 10వ నంబర్‌ని దయచేసి ఎవ్వరికీ కేటాయించవద్దు, అది ఎంతో ప్రత్యేకమైంది, క్రికెట్ దేవుడి నంబర్‌ని శార్దూల్‌కి ఎలా కేటాయిస్తారు, శార్దూల్.. దయచేసి సచిన్ జెర్సీ నంబర్ ధరించొద్దు, జెర్సీ నంబర్ 10 రిటైరయింది., దయచేసి నీ జెర్సీ నంబర్ మార్చుకో, ఈ నెంబరు ఎవ్వరికీ కేటాయించవద్దని బీసీసీఐకి అర్థమయ్యేలా చెప్పండి అంటూ ట్విటర్లో అభిమానుల విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి. అరంగేట్ర వన్డేలో ఏడు ఓవర్లు వేసిన శార్దూల్ ఒక వికెట్ తీసి 26 పరుగులు ఇచ్చాడు.

## రైల్వే మంత్రిగా నితిన్ గడ్కరీ?

న్యూఢిల్లీ : నరేంద్ర మోదీ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ యత్నాల నేపథ్యంలో రైల్వే మంత్రి పదవి నుంచి తప్పుకుంటానని సురేశ్ ప్రభు చెప్పినట్లు సమాచారం. ఇటీవలి రైలు ప్రమాదాలకు బాధ్యతవహిస్తూ రైల్వే శాఖను వదులుకునేందుకు ఆయన సంసిద్ధత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఆయన స్థానంలో ప్రస్తుత రోడ్లు, హైవేల మంత్రి నితిన్ గడ్కరీని రైల్వే మంత్రి పదవి వరించబోతున్నట్లు సమాచారం. సురేశ్ ప్రభుకు పర్యావరణ మంత్రిత్వ శాఖను అప్పగించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు చివరి, భారీ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరుగుతుందని బీజేపీ వర్గాలు చెప్తున్నాయి. రాష్ట్రపతి భవన్‌లోని అశోకా హాల్‌లో ఆదివారం ఉదయం 11 గంటలకు నూతన మంత్రులు ప్రమాణ స్వీకారం చేస్తారని సమాచారం. కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ బృందావన్ పర్యటనను రద్దు చేసుకుని, రాజధాని ఢిల్లీలోనే ఉన్నారు. కొత్తగా మంత్రులు కాబోతున్నవారిలో ఎక్కువమంది హిందీ రాష్ట్రాలవారేనని తెలుస్తోంది.

### కాకినాడ ఎన్నికల ఫలితాలు

# మహిళా శక్తికి నిదర్శనాలు

- అత్యధిక స్థానాలు కైవశం చేసుకున్న మహిళా అభ్యర్థులు
- బిజెపి, టీడీపీ కూటమి విజయదుందుభి
- ఇదే స్ఫూర్తితో భవిష్యత్తు కార్యాచరణ
- గ్రేటర్ పీఠం కూడా సాధిస్తాం
- నగర భాజపా మహిళా మోర్చా అధ్యక్షురాలు జి. ప్రేమకుమారి



కాకినాడ ఎన్నికల ప్రచారంలో వార్డు అభ్యర్థిని గెలిపించాలని పభుత్వ విప్ కూన రవితో పాటు ప్రచారంలో పాల్గొన్న నగర మహిళా మోర్చా అధ్యక్షురాలు ప్రేమకుమారి ( ఫైల్ ఫోటో )

విశాఖ సిటీః రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కాకినాడ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బిజెపి, టీడీపీ కూటమిలో పోటీ చేసిన అభ్యర్థులలో 18 మంది మహిళలు విజేతలుగా నిలవడం మహిళా శక్తికి గొప్ప నిదర్శనమని విశాఖ నగర భాజపా మహిళా మోర్చా అధ్యక్షురాలు జి. ప్రేమకుమారి సంతోషాన్ని వ్యక్తం చేశారు. శుక్రవారం వెలువడిన కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాల అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విజయోత్సవ సమావేశంలో ప్రేమకుమారి మాట్లాడుతూ బీజేపీ, టీడీపీ కూటమిగా పోటీచేసిన 48 స్థానాలలో టీడీపీ నుండి 18 మంది మహిళలు, బీజేపీ నుండి ముగ్గురు మహిళలు సంయుక్తంగా మొత్తం 21 స్థానాలు గెలుపొందడం విశేషం. చట్టసభలలో మహిళకు 33 శాతం అవకాశం ఇవ్వడం మహిళలకు రాజకీయాలపై ఆసక్తి పెంపొందించుటకు ఉపయోగపడటం జరిగిందన్నారు. కానీ కాకినాడ ఎన్నికలలో దాదాపు సగం స్థానాలు మహిళలు గెలుపొందడం రాజకీయాలలో పురుషులతో సమానంగా రాణించడం ఈ ఎన్నికల ద్వార రుజువు చేయడం మహిళా శక్తికి రాజకీయాలపై మహిళల ఆధిపత్యానికి నిదర్శనం. అలాగే ప్రతీ మహిళ రాజకీయాలలో చైతన్యం పెంపొందించుకోవాలని, ప్రజలకు సేవ చేసే అవకాశం ప్రతీ మహిళా అందిపుచ్చుకొని రాజకీయాలలో మహిళలు ఆసక్తి చూపించి ఉన్నత స్థానాలు చేరుకోవాలని అన్నారు. రానున్న రోజులలో గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు కాకినాడ ఎన్నికల మహిళల గెలుపు శుభసూచకంగా చేసుకొని బీజేపీ మహిళామోర్చా పటిష్ట పరిచి మహిళా శక్తి రాజకీయాలలో మహిళల ఆసక్తి కలిసి ప్రజలకు సేవ ప్రజాప్రగతిలో ప్రతి మహిళా భాగస్వామ్యం అవ్వాలని ఆశిస్తూ. ఆహ్వానిస్తూ బీజేపీ మహిళామోర్చాను బలపర్చాలని కోరుకుంటున్నా నన్నారు. దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన కలిగించే బాధ్యత ప్రతీ మహిళా కార్యకర్తపై ఉందని, రానున్న రోజుల్లో గ్రేటర్‌లో ఉన్న అన్ని వార్డులలో పర్యటించి మహిళా మోర్చాను బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఆమె తెలియజేశారు. ఈ సమావేశంలో నగర కార్యదర్శి వరలక్ష్మి, దీపిక మరియు అధిక సంఖ్యలో మహిళలు, తదితరులు పాల్గొనడం జరిగింది.



**విజయోత్సాహంతో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమకుమారి**

# విద్యాశాఖలో కొత్త కొలువులు



హైదరాబాద్: రాష్ట్రంలోని 81 జూనియర్ కాలేజీల్లో 1133 పోస్టుల భర్తీకి సీఎం చంద్రశేఖర్‌రావు ఆమోదం తెలిపారు. పాఠశాల విద్యాశాఖలోని సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల గౌరవ వేతనాలు, ఎస్ఎస్ఏ, కేజీబీవీల్లోని బోధన, బోధనేతర ఉద్యోగుల గౌరవ వేతనాల పెంపునకు కూడా సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు విద్యాశాఖ చేసిన పలు ప్రతిపాదనలకు సంబంధించిన ఫైలుమీద సంతకం చేశారు.

వివరాలను డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి మీడియాకు చెప్పారు. 2008లో అప్పటి ఉమ్మడిపాలకులు రాష్ట్రవ్యాప్తంగా 81 ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు అనుమతినిచ్చారు. అయితే పోస్టులు మాత్రం మంజూరు చేయలేదు. అప్పటినుంచి ఆ ఖాళీలు అలాగే ఉన్నాయి. కాలేజీల్లో నాణ్యమైన విద్యాప్రమాణాలు అందించే లక్ష్యంతో 1,133 కొత్త పోస్టులను మంజూరు చేస్తూ సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారని, ఈ పోస్టుల భర్తీ ప్రక్రియను త్వరలోనే ప్రారంభిస్తామని కడియం తెలిపారు.

## సెల్ఫీలు నేర్చుకుంటున్న మాజీ రాష్ట్రపతి



న్యూఢిల్లీ : భారత మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ సోషల్‌మీడియా ద్వారా ప్రజలకు చేరువగా ఉంటున్నారు. ఆ మధ్య తన వీడ్కోలు సందర్భంగా ప్రధాని మోదీ తనకు రాసిన లేఖను ట్విటర్ ద్వారా పంచుకున్న ప్రణబ్.. తాజాగా ఓ చిన్నారితో దిగిన ఫొటోను పోస్టు చేశారు. సెల్ఫీ ఎలా తీయాలో ఈ చిన్నారి నుంచే నేర్చుకుంటున్నానని అని క్యాప్షన్ ఇచ్చారు. పిల్లలను కలవడం ఎప్పుడూ ఆనందంగానే ఉంటుంది. ఇక్కడ కన్పిస్తున్న చిన్నారి హంజా సైఫీ నాకు సెల్ఫీలు ఎలా తీయాలో నేర్పాడు అని ప్రణబ్ ముఖర్జీ ట్వీట్ చేశారు. కొద్ది సేపటికే ఈ ఫొటో నెట్టింట్లో వైరల్‌గా మారింది. వేల కొద్ది లైక్‌లు, కామెంట్లు వచ్చాయి.మిమ్మల్ని చూడటం ఆనందంగా ఉంది సర్. ఎప్పుడూ నవ్వుతూ సంతోషంగా ఉండండి. మీతో సెల్ఫీలు దిగడం మా అందరికీ ఆనందమే అని నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.



## యువ ఆటగాళ్లకు మరో అవకాశం

కొలంబో: చివరి వన్డేలోనూ యువ ఆటగాళ్లకు అవకాశం కల్పిస్తామని భారత క్రికెట్ జట్టు సారథి విరాట్ కోహ్లీ అన్నాడు. ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా గురువారం భారత్-శ్రీలంక మధ్య జరిగిన నాలుగో వన్డేలో భారత్ 168 పరుగుల తేడాతో విజయం సాధించిన సంగతి తెలిసిందే. మ్యాచ్ అనంతరం కోహ్లీ మీడియాతో మాట్లాడుతూ.. సిరీస్‌లో చివరిదైన ఐదో వన్డేలోనూ యువ ఆటగాళ్లకు స్థానం కల్పిస్తాం. నాలుగో వన్డేలో ముగ్గురుకి అవకాశం ఇచ్చాం. ప్రస్తుతం భారత్ బ్యాటింగ్ ఆర్డర్ బాగానే ఉంది. ఒక్కోసారి జట్టును, పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రయోగాలు చేస్తాం అని కోహ్లీ తెలిపాడు. గత మూడు మ్యాచ్‌ల్లో టాస్ గెలిచినా మొదట బ్యాటింగ్‌కు దిగలేదు. నాలుగో వన్డేలో మాత్రం టాస్ గెలిస్తే బ్యాటింగ్ చేయాలని ముందుగానే నిర్ణయించుకున్నాం. భారీ స్కోరు సాధిస్తే.. ఛేదనలో శ్రీలంక తడపడుతోందని ముందే వూహించామని కోహ్లీ చెప్పాడు. నా ప్రదర్శన ఎంతో సంతృప్తినిచ్చింది. మ్యాచ్‌లు ఆడేందుకు యువ ఆటగాళ్లు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు.




# విద్యావసరాలకు వినియోగించాలి

హైదరాబాద్: విక్టోరియా మెమోరియల్ ట్రస్ట్ భూములను విద్య అవసరాల కోసం తప్ప ఇతర అవసరాల కోసం వాడుకోవద్దని తెలంగాణ రాజకీయ ఐకాస ఛైర్మన్ ప్రొ.కోదండరాం ప్రభుత్వాన్ని కోరారు. సుందరయ్య కళానిలయంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో విక్టోరియా మెమోరియల్ ట్రస్ట్ భూముల్లో పది ఎకరాలను రాచకొండ కమిషనరేట్, మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి, వైద్య ఆరోగ్య శాఖ నిర్మాణాలకుగాను 26 ఎకరాల స్థలాన్ని కేటాయించే ప్రతిపాదనలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండు చేస్తూ సాయంత్రం రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కోదండరాం మాట్లాడారు.

ఆరో నిజాం నవాబు మీర్ మహమూద్ అలీఖాన్ బ్రిటిష్ రెసిడెంట్‌గా ఉన్న సర్ డేవిడ్ చార్ విక్టోరియా స్మారకార్థం 73 ఎకరాల సువిశాల ప్రాంతంలో ఒక ప్యాలెస్‌ను నిర్మించారని గుర్తుచేశారు.1903లో అనాథ పిల్లల విద్యా భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఒక విద్యాలయంగా మార్చారన్నారు. సుమారు ఐదున్నర దశాబ్దాల కాలంగా అనాథ పిల్లల సంక్షేమం, విద్యాభివృద్ధి కోసం పాటుపడుతోందన్నారు. ఈ ట్రస్ట్ భూములను పోలీసు వ్యవస్థకు అప్పగిస్తే భవిష్యత్తు అవసరాల దృష్ట్యా అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్య మాట్లాడుతూ.. ప్రపంచంలోని అన్ని దేశాలు పాఠశాలలు, ఆసుపత్రుల సంఖ్య పెంపునకు పెట్టుబడులు పెట్టి కృషి చేస్తుంటే తెలంగాణ సర్కారు మాత్రం విద్యా నిలయాన్ని పోలీసుశాఖకు కేటాయించడం హాస్యాస్పదమన్నారు.

వీఎం హోం స్థలాల్లో రాచకొండ పోలీస్ కమిషనరేట్‌కు పదెకరాలు కేటాయిస్తు విడుదల చేసిన జీఓ నంబర్ 48ని రద్దు చేయాలని పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగటి నారాయణ అన్నారు.






Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published from ANH Apartments, Block-A, Flat No. 508, Bazar Ghat, Red Hills, Hyderabad-500 004. and printed at **VIJAYABHANU PRESS**, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003. R.N.I. No. 37754/81. Postal Regd. No. H-HD-1017/2006-08, Phone : 040 23370933, Fax : 040 66770933, Cell: 9701529570 ☆ e-mail: vijayabhanudaily@gmail.com